44 వేల ఎకరాల ఫ్రీహోల్డ్ భూములపై విచారణ పూర్తి


మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: మదనపల్లె డివిజన్ పరిధిలోని 11 మండలాల్లోని 44 వేల ఎకరాల ఫ్రీహోల్డ్ భూములకు సంబంధించి విచారణ పూర్తయిందని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ తెలిపారు. మదనపల్లె సబ్‌కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. మొత్తం 44 వేల ఎకరాల్లో ఫ్రీహోల్డ్‌కు సంబంధించి 22 వేల ఎకరాల భూములు నిబంధనలకు విరుద్ధంగా ఉండడం, అసైన్‌మెంట్ సరిగా లేకపోవడం, సరైన దస్త్రాలేకపోవడాన్ని గుర్తించి తిరిగి సమగ్ర విచారణ చేపట్టామన్నారు. మదనపల్లె డివిజన్‌లో అత్యధికంగా పెద్దమండ్యం మండలంలో 9,200 ఎకరాల వరకు ఫ్రీహోల్డ్ చేశారని వివరించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో దస్త్రాల దహనం కేసు దర్యాప్తును సీఐడీకి అప్పగించడంతో ఆయా గదులను వారి పర్యవేక్షణలో ఉంచామన్నారు. ఆర్వోఆర్ కేసులపై త్వరలో విచారణ చేపడతామన్నారు. జిల్లాలో హిట్ అండ్ రన్ కేసులకు విచారణాధికారిగా తనను నియమించినట్లు తెలిపారు. ఇందులో బాధితులను విచారించి కేంద్ర ప్రభుత్వం తరఫున రూ.లక్ష పరిహారం మంజూరు చేస్తామన్నారు. భూ సమస్యలపై 60 రోజుల్లో, ధ్రువీకరణ పత్రాలు, ఇతర సమస్యలపై 30 రోజుల్లో విచారణ నిర్వహించి సబ్‌కలెక్టరేట్‌కు నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించామన్నారు. ఇసుక, మట్టి అక్రమ రవాణా, భూఆక్రమణలు జరగకుండా ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలిపారు. గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి సమస్యలుంటే చర్యలు తీసుకుంటామని సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్ వివరించారు.

సినిమాల చిత్రీకరణకు అనువైన ప్రాంతం హార్సిలీహిల్స్!

పురస్కారం ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: ప్రముఖ పర్యాటక కేంద్రమైన బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్ సినిమాల చిత్రీకరణకు అనువైన ప్రాంతంగా గుర్తింపు పొందింది. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం గురువారం రాత్రి పురస్కారం ప్రకటించింది. పర్యాటక దినోత్సవం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి చేతులమీదుగా కలెక్టర్ శ్రీధర్, జిల్లా పర్యాటక అధికారి (డీటీవో) నాగభూషణం పురస్కారం అందుకోనున్నారు. తాజాగా లభించిన పురస్కారంతో హార్సిలీహిల్స్‌లో సినిమాలు చిత్రీకరించేందుకు దర్శక, నిర్మాతలు ఆసక్తిచూపుతారని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

అనుకూలమైతే ఓకే... లేకుంటే వెనక్కే!

జడ్పీ ఉద్యోగుల బదిలీలపై ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లు ◆ ఉద్యోగులను చేర్చుకోని కార్యాలయాల అధికారులు

– న్యూస్‌టుడే, కడప ఏడురోడ్లు

జిల్లా పరిషత్తులో బదిలీల ప్రక్రియ అధికారికంగా ఈనెల 22న పూర్తయ్యింది. బదిలీ అయిన ఉద్యోగులు ఈనెల 23 నుంచి బదిలీ ఉత్తర్వులను తీసుకుని సంబంధిత కార్యాలయాలకు వెళుతున్నారు. తమకు అనుకూలమైన వారొస్తే అంగీకరిస్తూ, కానివారిని తిరస్కరిస్తూ ఉమ్మడి కడప జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల నుంచి తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు వస్తుండడంతో బదిలీపై వచ్చిన ఉద్యోగుల నుంచి సంబంధిత అధికారులు జాయినింగ్ ఆర్డర్లు తీసుకోవడంలేదు దీంతో జడ్పీ అధికారులను బాధిత ఉద్యోగులు సంప్రదిస్తున్నారు. దీంతో వారిని వేరే ప్రాంతానికి సర్దుబాటు చేయలేక, ప్రజాప్రతినిధులకు చెప్పుకోలేక జడ్పీ అధికారులు అయోమయంలో పడ్డారు.


ఉద్యోగినికి బదిలీ ఉత్తర్వులు అందజేస్తున్న జడ్పీ అధికారులు

◆ ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బదిలీల ప్రక్రియ చేపట్టడంతో జడ్పీ ఉద్యోగులు సంతోషించారు. దూరప్రాంతాల్లో పనిచేస్తున్నవారు దగ్గరగా రావచ్చునని ఆశతో ఎదురుచూశారు. గత నెల 17వ తేదీన బదిలీల నోటిఫికేషన్ విడుదల కాగా, అదే నెల 31వ తేదీలోగా ప్రక్రియ పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. విజయవాడలో వరదల కారణంగా ఈనెల 22వ తేదీ వరకు బదిలీ ప్రక్రియ సాగింది. ఈనెల 23 నుంచి బదిలీ అయిన ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులిస్తూ వచ్చారు. మొత్తం 15 శాఖల్లోని ఉద్యోగులను బదిలీ చేశారు. జడ్పీ పరిధిలో అయిదేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులు 438 మంది ఉండగా, 305 మంది బదిలీ అయ్యారు. బదిలీ ప్రాంతాలకు వెళుతున్న ఉద్యోగులను మాకు మీరు వద్దు... మాకు కావాల్సినవారే మా ప్రాంతంలో ఉండాలంటూ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల నుంచి జడ్పీ అధికారులకు తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు వస్తున్నాయి. దీంతో జడ్పీ అధికారులు ఏం చేయాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బదిలీల ప్రక్రియ పూర్తిచేసినందుకు సంతోష పడాలా... లేక ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో తమకు బదిలీ అయిన ప్రాంతంలో జాయినింగ్ రిపోర్టును తీసుకోనందుకు బాధపడాలో అర్థం కాని పరిస్థితి కొంతమంది ఉద్యోగులకు నెలకొంది. ఈ విషయమై జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

◆ జడ్పీలోని క్యూఏ-క్యూసీ విభాగంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉద్యోగినికి అయిదేళ్లు పూర్తికావడంతో బదిలీల్లో భాగంగా రాజుపాలెం మండలం ఆర్కటవేముల జడ్పీ ఉన్నత పాఠశాలకు బదిలీ చేశారు. ఈ నెల 24వ తేదీన ఆమె ఆర్కటవేముల పాఠశాలలో జాయినింగ్ ఆర్డర్‌ను ఇచ్చేందుకు వెళ్లారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాయినింగ్ ఆర్డర్‌ను తీసుకోలేదు. ప్రజాప్రతినిధులు జాయినింగ్ ఆర్డర్‌ను తీసుకోవద్దని చెప్పారన్నారు. దీంతో ఆమె జడ్పీ అధికారులను సంప్రదించడంతో వల్లూరు మండలం గంగాయపల్లె జడ్పీ హెచ్ఎస్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. అక్కడ కూడా ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిళ్లు రావడంతో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆమె జాయినింగ్ రిపోర్టును తీసుకోలేదు. ప్రస్తుతం ఆమెకు ఎక్కడ పోస్టింగ్ ఇవ్వాలనేదానిపై జడ్పీ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

◆ జడ్పీలో టైపిస్టుగా పనిచేస్తున్న ఓ ఉద్యోగినికి అట్లూరు ఎంపీడీవో కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆమె జాయినింగ్ ఆర్డర్‌ను కార్యాలయం అధికారులు తీసుకోకపోవడంతో వెనుదిరిగారు. అట్లూరు ఎంపీడీవో కార్యాలయంలో ఓ ఉద్యోగి అయిదేళ్లుగా పనిచేస్తున్నారు. ఈయనదీ తప్పనిసరి బదిలీ అయినప్పటికీ అక్కడే ఉంచాలని ప్రజాప్రతినిధులు జడ్పీ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. నిబంధనల ప్రకారం అయిదేళ్లు ఒకే ప్రాంతంలో పనిచేసినవారు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంది. ప్రజాప్రతినిధుల ఒత్తిడితో అయిదేళ్లు పూర్తయినా సదరు ఉద్యోగి అదే కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు.

◆ రైల్వేకోడూరు ఇంజనీరింగ్ కార్యాలయంలో పనిచేస్తున్న పరిపాలనాధికారిని చిట్వేలికి బదిలీ చేశారు. ఈయన మరో 8 నెలల్లో ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈయనకు గతంలో గుండె బైపాస్ సర్జరీ జరగడంతోపాటు క్యాన్సరు బారిన పడ్డారు. ఇటీవల ఓ ప్రమాదంలో తొడ ఎముకలు విరగడంతో శస్త్రచికిత్స సైతం జరిగింది. చిట్వేలి కార్యాలయంలో పనిచేస్తున్న పరిపాలనాధికారికి పెద్దముడియంకు బదిలీ కాగా, ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిడి రావడంతో ఈయనను ఇక్కడే ఉంచి, చిట్వేలి కార్యాలయానికి బదిలీ చేసిన పరిపాలనాధికారిని పెద్దముడియంకు బదిలీ చేశారు.

అభివృద్ధికి గండి కొట్టిన గత వైకాపా సర్కారు

గత అయిదేళ్లుగా గండ్లు పూడ్చలేని పరిస్థితి

ఎన్డీయే సర్కారుపైనే రైతాంగం గంపెడాశలు


కలికిరి మండలం మొరంకిందపల్లె వద్ద చెరువుకు పడిన గండి (పాత చిత్రం)

చెరువులు ఛిద్రం!

– ఈనాడు, కడప

గత వైకాపా ప్రభుత్వ పాలనలో చిన్ననీటిపారుదల వ్యవస్థ ఛిద్రమైంది. జలయజ్ఞం సాగిస్తానని అప్పటి సీఎం ప్రతిజ్ఞ చేసి గట్టున పెట్టేశారు. భారీ ప్రాజెక్టుల నిర్మాణం దేవుడెరుగు... కనీసం చెరువులను సైతం పట్టించుకోలేని దుస్థితికి దిగజారారు. కేంద్రం, ప్రపంచ బ్యాంకు, జపాన్ సహా ఎన్నో సంస్థలు నిధులివ్వడానికి సిద్ధంగా ఉన్నా సద్వినియోగం చేసుకోలేని దురవస్థలో గత వైకాపా పాలన సాగింది. కనీసం చెరువులకు పడిన గండ్లను సైతం పూడ్చకుండా వదిలేసి రైతాంగానికి తీరని అన్యాయం చేసింది. 'రాజన్నకు పుత్రుడను.. రైతన్నకు మిత్రుడను... జగనన్న.. జగనన్న..' అంటూ వైకాపా హోరెత్తించిన ఓ పాట ఎంతో ప్రాచుర్యం పొందింది. మరి అధికారం చేపట్టాక జగనన్న ఏం చేశారు.. అన్నదాతల నోట్లో మట్టి కొట్టే చర్యలకు తెరతీశారు. సాగుకు నీరే ఆధారం. భారీ, మధ్య తరహా ప్రాజెక్టుల నిర్మాణంలోనూ నిధులివ్వలేక చేతులెత్తేసిన ప్రభుత్వం కనీసం చెరువులను పట్టించుకున్న పాపాన పోలేదు. వర్షాధార ప్రాంతాలైన అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాలో చెరువులే రైతులు, ప్రజలకు జీవనాధారం. అలాంటి చెరువులు గతంలో వైకాపా నాయకులకు ఆర్థిక వనరులుగా, ఆస్తులుగా మారిపోయాయి. పూర్తిగా చెరువులను పునరుద్ధరించి సాగు, తాగునీటికి యోగ్యంగా తయారు చేయాల్సిన జగన్ సర్కారు చేష్టలుడిగి చూసింది. వర్షాధార ప్రాంతాల్లో కొత్త చెరువుల అభివృద్ధి చేపట్టి ఆయకట్టు సాగులోకి తీసుకురాలేకపోయింది. గతంలో ప్రపంచ బ్యాంకు ముందుకొచ్చినా, జపాన్ ఆర్థికసాయం చేసినా, నాబార్డు నిధులిచ్చినా వైకాపా సర్కారు ఆ చేయూతను అందుకోలేకపోయింది. తన వాటా నిధులు సరిగా ఇవ్వకపోవడంతో ఆర్థిక సాయం సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి తలెత్తింది.

వైఎస్సార్‌లో ఇదీ పరిస్థితి

వైఎస్సార్ జిల్లాలో చెరువుల పునరుద్ధరణ, మరమ్మతులకు కృషి సించాయి యోజన కింద 235 చెరువుల పనులు చేపట్టేందుకు 2016లో తెదేపా హయాం నుంచి ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇందులో కేంద్రం 60 శాతం నిధులు ఇవ్వనుండగా, మిగిలిన నిధులు రాష్ట్రం భరించాల్సి ఉంటుంది. మొత్తం రూ.137.49 కోట్లతో అంచనాతో చేపట్టిన పనులు నత్తనడకన సాగుతూ నిలిచిపోయాయి. పథకం కింద 2023, మార్చి వరకు రూ.30 కోట్లు మాత్రమే వెచ్చించారు.

◆ ప్రపంచ బ్యాంకు రుణసాయంతో చిన్న నీటి వనరుల అభివృద్ధికి రూ.1,600 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారు. 2017-18లో ప్రారంభమైన ప్రాజెక్టు 2023-24 నాటికి పూర్తి కావాల్సి ఉండగా ఇంత వరకు పూర్తి చేయలేదు. ప్రాజెక్టు కింద వెయ్యి చెరువులను పునరుద్ధరించి 2,26,552 ఎకరాల ఆయకట్టు స్థిరీకరించాలనే ప్రయత్నానికి వైకాపా ప్రభుత్వం గండి కొట్టింది. ప్రపంచ బ్యాంకు నిధులతో పాటు రాష్ట్రం వాటాగా 30 శాతం నిధులివ్వాల్సి ఉండగా, వాటిని సమకూర్చకపోవడంతో పనులు ఆగిపోయాయి.

మంత్రి నిమ్మల దృష్టికి సమస్యలు

అన్నమయ్య జిల్లాలో గత అయిదేళ్లలో వరదలకు 106 చెరువులకు గండ్లు పడినా ఒక్కటి కూడా మరమ్మతులకు నోచుకోలేదు. ఈ విషయం ఇటీవల జిల్లాలో పర్యటించిన రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి వచ్చింది. దీనిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి వెంటనే గండ్లు పూడ్చడానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు యుద్ధప్రాతిపదికన రూ.41.32 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి మంత్రికి నివేదించారు. రానున్న రబీ సీజన్‌కు చెరువుల్లో నీటిని నిలబెట్టి రైతులకు సాగు నీరందించే దిశగా మంత్రి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

◆ వాల్మీకిపురం మండలం బహుదా నది నుంచి తాటి చెరువుకు నీరందించే కాలువ తాటిగుంటపల్లె వద్ద కొట్టుకుపోయింది. దీని మరమ్మతులకు రూ.95 లక్షలతో ప్రతిపాదనలు తయారు చేశారు. ◆ కురబలకోటలో శీతివారిపల్లె సమీపంలో శీతి చెరువు కట్ట తెగిపోగా, దాని పునరుద్ధరణకు రూ.88 లక్షలతో చిత్తూరు ఇరిగేషన్ సర్కిల్ కార్యాలయానికి పంపగా, ఇంతవరకు మోక్షం కలగలేదు. ◆ పీలేరులో మల్లెమ్మ చెరువు, పోతల, తలుపుల కుంట చెరువులకు మరమ్మతులు చేపట్టకపోవడంతో నీటి నిల్వకు అవకాశం లేకుండా పోయింది. ◆ ములకలచెరువు మండలం పట్నాయని చెరువు రూ.39 లక్షలు, కలికిరిలో కె.రెడ్డివారిపల్లె వద్ద దండోని ఒడ్డు చెరువు మరమ్మతులకు రూ.20 లక్షలు సైతం వెచ్చించలేకపోయింది. ఒక్క చెరువు సైతం పునరుద్ధరణకు నోచుకోకుండా వేలాది ఎకరాల ఆయకట్టు బీడుగా మారిపోయింది. కొందరు రూ.లక్షలు వెచ్చించి బోర్లు తవ్వుకుని పంటలు సాగు చేయాల్సి పరిస్థితి నెలకొంది.


ఇటీవల అన్నమయ్య జిల్లా పర్యటనలో అధికారులకు సూచనలిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

వివాహమైన 40 రోజులకే అనంతలోకాలకు...

రహదారి ప్రమాదంలో యువకుడి మృతి

శోకసంద్రంలో భార్య, కుటుంబ సభ్యులు



చిట్టినగర్ (విజయవాడ), న్యూస్‌టుడే: ఆ యువకుడికి వివాహమై 40 రోజులైంది. అప్పుడే ఆయనకు నూరేళ్లు నిండాయి. మరో పది నిముషాల్లో ఇంటికి చేరుకుంటారనగా మృత్యువు వెంటాడింది. రహదారి ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. అన్నమయ్య జిల్లా పుల్లంపేటకు చెందిన **నాదెళ్ల దినేష్** (32)కి విజయవాడలోని పాల ఫ్యాక్టరీ సమీపంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన జోష్నవితో గత నెల 14వ తేదీన వివాహమైంది. దినేష్ పుల్లంపేటలో ఉంటూ సెలూన్ నిర్వహిస్తున్నారు. వైఎస్ఆర్ కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాలలో జోష్నవి 9వ తరగతి వరకు చదువుకోగా, టీసీ తీసుకుందామని ఈ నెల 23న భార్యాభర్తలు వైఎస్ఆర్ కాలనీకి వచ్చారు. అజిత్‌సింగ్‌నగర్‌లో జోష్నవి అత్త రాఘవేణి ఉండగా, ఆమెను పలకరించి వస్తానని చెప్పి ద్విచక్ర వాహనంపై ఈనెల 25వ తేదీన రాత్రి దినేష్ 9.30 గంటలకు వెళ్లారు. తిరిగి వస్తుండగా వైవీరావ్ రింగు సెంటర్ సమీపంలోని వెల్కం హోటల్ సమీపంలో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన మిఠాయిలు విక్రయించే తోపుడు బండిని ఢీకొనడంతో తలకు బలమైన గాయమై తీవ్ర రక్త స్రావమైంది. దినేష్ ఇంటికి చేరుకున్నాడో లేదోనని రాత్రి 10.45 గంటలకు రాఘవేణి ఫోన్ చేయగా, గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ లిఫ్టు చేసి వెల్కం హోటల్ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగిందని చెప్పారు. దీంతో ఆమె ఆయన భార్య జోష్నవికి ఫోన్ చేసి విషయం చెప్పగా ఘటనాస్థలానికి చేరుకున్నారు. అప్పటికే రోడ్డు పక్కన మాట్లాడలేని స్థితిలో ఉండగా, రాత్రి 11.45 గంటలకు 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విధుల్లో ఉన్న వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. వివాహమై 40 రోజులకే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడని భార్య, కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు సీఐ చినకొండలరావు తెలిపారు.

నిఘా కన్ను కునుకు!

☛ ఒంటిమిట్ట క్షేత్రంలో పనిచేయని సీసీ కెమెరాలు

☛ పోలీసుల పరిశీలనతో వెలుగులోకి వాస్తవాలు


ఒంటిమిట్ట కోదండరామాలయంలో తూర్పు గోపురం ద్వారం వద్ద మూడో నేత్రం నేలచూపులు

– న్యూస్‌టుడే, ఒంటిమిట్ట

ప్రముఖ పుణ్యక్షేత్రం ఒంటిమిట్ట బస్టాండు ప్రాంతంలో పోలీస్‌స్టేషన్ పక్కనే ఎస్‌బీఐ ఏటీఎంలోకి ఈ నెల 22న తెల్లవారుజామున ఘరానా దొంగలు చొరబడి రూ.36.19 లక్షలు దోచేశారు. ఈ నేపథ్యంలో కోదండ రామాలయం చుట్టూ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించేందుకు పోలీసులు రాగా, అవన్నీ అలంకారప్రాయంగా ఉన్నట్లు గుర్తించారు. దొంగల ఆనవాళ్లు కనిపెట్టేందుకు వచ్చిన పోలీసులకు నిరాశే ఎదురైంది.

◆ ఒంటిమిట్ట కోదండ రామాలయం ఆంధ్రుల భద్రాద్రిగా విరాజిల్లుతోంది. రాష్ట్ర అధికారిక గుర్తింపు పొందిన దివ్య క్షేత్రంగా భాసిల్లుతోంది. అయిదేళ్ల కిందట ఆలయ ముఖ, రంగ, కల్యాణ మండపాలు, ప్రాకారం గోడలు, శ్రీవారి పోటు, ప్రసాదాల పంపిణీ, తూర్పు గోపురం, భక్త సంజీవరాయస్వామి ఆలయం, మాడవీధులు, కాలిబాటలు, ఉద్యాన వనాలు, పుష్కరిణి, వాహనాల పార్కింగ్, రథమండపం, పరిపాలన, విశ్రాంతి భవనం, కడప-రేణిగుంట జాతీయ రహదారి పక్కన మొత్తం 45 చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అనంతరం వీటి పనితీరు, నిర్వహణను గాలి కొదిలేశారు. సత్రపాళెం గుట్ట పక్కన ఏర్పాటు చేసిన సీసీ కెమెరా రెండేళ్ల కిందట చోరీకి గురికాగా, ఇప్పటివరకు కొత్తది అమర్చలేదు. శ్రీవారి పోటు వద్ద రెండు సీసీ కెమెరా ఏడాది కిందట మరమ్మతులకు గురయ్యాయి. ఇప్పటివరకు 12 కెమెరాలు మాత్రమే వినియోగంలో లేవని, మరో 30 పనిచేస్తున్నాయని భద్రతా సిబ్బంది రోజువారీగా తిరుపతి విజిలెన్స్, భద్రత, పరిపాలన అధికారులకు సమాచారమిస్తూ వస్తున్నారు. ఈనెల 22న ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ అనంతరం ఇక్కడ సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు అవాక్కయ్యారు. సీసీ కెమెరాలు పనిచేయడంలేదని గతంలో స్థానికులు జేఈవో వీరబ్రహ్మం దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. ఆ తరువాత అప్పటి వీజీవో బాలిరెడ్డి కూడా బాగు చేయిస్తామని చెప్పినా ఇంతవరకు ఆచరణకు నోచుకోలేదు.


పరిపాలన భవనం వెనుక వైపున కిందకు వేలాడుతూ...


శ్రీవారి పోటు వద్ద దెబ్బ తిందిలా...


సత్రపాళెం గుట్ట వద్ద రెండేళ్ల కిందట చోరీకి గురైన సీసీ కెమెరా

విజిలెన్స్ అధికారులకు తెలియజేశాం

ఒంటిమిట్ట రామాలయం, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో కొన్ని పనిచేయడం లేదని మా దృష్టి వచ్చింది. మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని ఇప్పటికే విజిలెన్స్, భద్రతా అధికారులకు తెలియజేశాం. వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని లేఖ కూడా రాశాం. అన్నిచోట్ల నిఘా నేత్రాలు పనిచేసేవిధంగా చర్యలు తీసుకుంటాం.

- నటేష్‌బాబు, డిప్యూటీ ఈవో, తితిదే, ఒంటిమిట్ట

జగన్‌ను ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయి

'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పక్కన తెదేపా నాయకులు

బి.కొత్తకోట, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వినియోగించడం ద్వారా భక్తుల మనోభావాలను దెబ్బతీసిన మాజీ సీఎం జగన్‌తో పాటు వైకాపా నాయకులను ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గర పడ్డాయని ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ విమర్శించారు. బి.కొత్తకోట మండలం బడికాయలపల్లెలో గురువారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో గత ఐదేళ్లలో చోటుచేసుకున్న భూదోపిడీ, అవినీతి, అక్రమాలపై పూర్తి స్థాయి విచారణ జరిపిస్తామన్నారు. తెదేపా కార్యకర్తలపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయడానికి ఎన్డీయే ప్రభుత్వం ఇప్పటికే కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. అంతకు ముందు బడికాయలపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఎమ్మెల్సీ సమావేశమై విద్యాశాఖపై ప్రభుత్వం చూపుతున్న ప్రత్యేక శ్రద్ధను వివరించారు. అనంతరం సున్నా వడ్డీ కింద మంజూరైన రూ.2.80 కోట్ల రుణాలను ఎమ్మెల్సీ పంపిణీ చేశారు.

హంద్రీ-నీవా కాలువ విస్తరణ పనులు ప్రారంభం: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రతి చెరువుకు హంద్రీ-నీవా జలాలు అందిస్తామని ఎమ్మెల్సీ శ్రీకాంత్, తెదేపా నేత జయచంద్రారెడ్డి అన్నారు. పెద్దతిప్ప సముద్రం మండలం దేవప్పకోట సమీపంలోని రూ.348 కోట్లతో హంద్రీ-నీవా కాలువ విస్తరణ పనులను గురువారం వారు ప్రారంభించారు. రైతుల సౌకర్యార్థం మద్దయ్యగారిపల్లి వద్ద రెండు వంతెలను నిర్మిస్తామని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో తెదేపా జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, తెదేపా తంబళ్లపల్లె నేత జయచంద్రారెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ సభ్యురాలు పర్వీన్‌తాజ్, నియోజకవర్గ పరిశీలకుడు మల్లికార్జునాయుడు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి సాయినాథ్, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ రాజగోపాల్, ఈఈ ప్రసాద్‌రెడ్డి, సర్పంచి అనిత, అధికారులు, నాయకులు, పాల్గొన్నారు.

వానలు రాకపాయె... వేరుసెనగ ఎండిపాయె!

– న్యూస్‌టుడే, చిన్నమండెం

జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా రాయచోటి, లక్కిరెడ్డిపల్లె వ్యవసాయ డివిజన్లలో కరవు విలయ తాండవం చేస్తోంది. ఫలితంగా ఖరీఫ్‌లో వర్షాధారంగా సాగు చేసిన వేరుసెనగ పంట నిలువునా ఎండిపోయింది. పంట ఊడలు, కాయ ఏర్పడే దశలో వర్షాలు కురవకపోవడంతో ఒక ట్రెండు కాయలు ఏర్పడినా తొర్రలుగా ఉండి నాసులే దర్శనమిస్తున్నాయి. రాయచోటి నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల్లో 8,750 ఎకరాల్లో వేరుసెనగ సాగులో ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఎకరా సాగుకు రూ.వేలల్లో పెట్టుబడి వ్యయమవుతోందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎకరాకు ఒకటి, రెండు బస్తాలే దిగుబడి వచ్చే అవకాశం ఉంది. వీటిని కొనేందుకు వ్యాపారులు ముందుకు రాని పరిస్థితి నెలకొంది. దీంతో రూ.కోట్ల పెట్టుబడులు రైతులు నష్టపోతున్నారు. ఆకు కూడా మాడిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. అరకొరగా పంట బాగున్నా రైతులు పశు గ్రాసానికైనా పనికొస్తుందని నూర్పిడి చేస్తున్నారు. తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వేరుసెనగ మొక్కకు ఒకట్రెండు తొర్రకాయలే ఉన్నాయని చూపుతున్న ఈయన చిన్నమండెం మండలం కొండమూలకు చెందిన రైతు బండి వెంకటయ్య. ఎకరా విస్తీర్ణంలో పంట సాగు చేశానని, ఆశించిన మేర దిగుబడులు రాకపోవడంతో కూలి ఖర్చులు కూడా వచ్చే అవకాశం లేదని కన్నీటిపర్యంత మవుతున్నారు.



ఎండిపోయిన వేరుసెనగ పంటను చూపుతోంది చిన్నమండెం మండలం జల్లావాండ్లపల్లెకు చెందిన నాగరాజు కుటుంబం. రెండెకరాల్లో పంట సాగు చేయగా రూ.25 వేల వరకు ఖర్చు వచ్చినట్లు చెబుతున్నారు. పంట ఊడల దశలో వానలు కురవకపోవడంతో పంట నిలువునా ఎండిపోయిందన్నారు. పంట కేవలం జీవాల మేతకు సరిపోతుందని, దిగుబడి రాకపోవడంతో తీవ్రంగా నష్ట పోతున్నామని వాపోతున్నారు.




దేవగుడిపల్లెలో ఎండిపోయిన వేరుసెనగ పంట

బొప్పాయి రైతుల ఆందోళన


సీఐటీయూ నాయకులు, రైతుల నిరసన

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే : బొప్పాయి రైతులను దళారుల మోసాల నుంచి రక్షించాలని కోరుతూ స్థానిక టోల్‌గేట్ వద్ద గురువారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, రైతులు ఆందోళన చేపట్టారు. ఇతర ప్రాంతాల్లో బొప్పాయి టన్ను రూ.25 వేలు పలుకుతున్నా ఇక్కడ మాత్రం రూ.10 వేలకు కొనుగోలు చేయడం దారుణమన్నారు. పైగా టన్ను కాయలకు వంద కిలోల సూట్ పేరుతో దోచేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జాన్‌ప్రసాద్, యానాదయ్య, రైతు సంఘం నాయకులు రమణయ్య, ఆదినారాయణరెడ్డి, వెంకటరామయ్య, కృష్ణారెడ్డి పెద్దసంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి రమణీయత.. చెరగని ఆత్మీయత!

● చరిత్ర పుటల్లో మన గడ్డకు స్థానం

● నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

ఉమ్మడి కడప జిల్లాలో 21 చారిత్రక కట్టడాలున్నాయి. వీటి పర్యవేక్షణ, అభివృద్ధి భారతీయ పురాతత్వ శాఖ పరిధిలోకి చేర్చారు. ఒంటిమిట్ట, సిద్దవటం, నందలూరు, రాజంపేట, జమ్మలమడుగు, వల్లూరు, చెన్నూరు, పెద్దముడియం, ఎర్రగుంట్ల మండలాల్లో పూర్వం రాజుల కాలంలో నిర్మించిన చారిత్రక కట్టడాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. రామాయణ, భారత, భాగవతం, జానపద కళారూపాలు అనితర సాధ్యంగా రూపుదిద్దుకున్నాయి. రాతి కట్టడాల లాలిత్యం రాజసం చూసిన యాత్రికులు అంతులేని ఆనందానుభూతితోపాటు తన్మయత్వం చెందుతున్నారు.

శత్రు దుర్భేద్యం.. ఘన కీర్తి సొంతం




జమ్మలమడుగు మండలంలో గండికోట శత్రు దుర్భేద్యంగా నిర్మించారు. పినాకినీ తీరంలో నిర్మించిన 40 అడుగుల ఎత్తు ప్రాకారం, 101 బురుజులతో తన ఠీవిని ప్రదర్శిస్తోంది. చుట్టూ అందమైన లోయలు. ఎటుచూసినా కమనీయ కట్టడాలు యాత్రికులను కట్టిపడేస్తున్నాయి. నాటి రాచరిక పాలన, రాజుల పౌరుషం, యుద్ధాలు గుర్తుకొచ్చేలా నిర్మాణాలెన్నో ఇక్కడున్నాయి. సహజమైన పెన్నా లోయ అబ్బుర పరుస్తోంది. సామంత మహారాజు కాకరాజు గండికోటను నిర్మించారని చారిత్రక శాసనాలు స్పష్టం చేస్తున్నాయి. నాడు ఇక్కడ 21 ఆలయాలను నిర్మించారు. రఘునాథ, మాధవస్వామి క్షేత్రాలు, విశాలమైన మంటపాలు, పావురాల మండపం, కారాగారం, ఎర్ర కోనేరు, జామియా మసీదు, నింగిలో మేఘాలతో దోబూచులాడే మీనార్లు, 10 మీటర్ల ఎత్తు ఉన్న ధాన్యాగారం, పెన్నానది లోయలు, ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఆయుధాగారం, ఎర్రచెరువు, ఊయల మండపం, మూడు ప్రవేశ ద్వారాలు, బయట 32, లోపల 64 గదులున్నాయి. కోటలోని శిల్పాల వన్నె నేటికీ తరగలేదు. నాటి శిల్పుల నైపుణ్యాలకు అద్దం కడుతోంది. చారిత్రాత్మక అమరగాథలకు మౌన సాక్షిగా నిలిచిన ఈ కోట మన వారసత్వ సంపదకు ప్రతీకగా నిలుస్తోంది.

ప్రాచీన జైన క్షేత్రం దానవులపాడు

జమ్మలమడుగు మండలం పినాకిని తీరంలో మహోన్నత జైనక్షేత్రంగా దానవులపాడు గుర్తింపు పొందింది. సున్నపురాతి శిల్పాలున్నాయి. జైనతీర్థంకరుని విగ్రహం, పద్మావతి, రామాలయం చూపరులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. ఎర్రగుంట్ల మండలం చిలంకూరులో విఘ్నేశ్వర, అగస్త్యేశ్వరస్వామి, పెద్దముడియం దివ్య క్షేత్రాలు, చెన్నూరు మండలం శివాల్‌పల్లి ఆలయం పురాతన కట్టడాల జాబితాలో చేరాయి.

అందాల కొండ హార్సిలీహిల్స్



ప్రకృతి అందాల కొలువు... ఆహ్లాదకరమైన వాతావరణానికి నెలవుగా ఉన్న బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్ పర్యాటకులకు సాదర స్వాగతం పలుకుతోంది. రాష్ట్ర పర్యాటక రంగ చిత్రపటంలో ప్రత్యేక స్థానం కల్గిన ఈ విడిది కేంద్రానికి ఆంధ్రా ఊటీగా ప్రత్యేక గుర్తింపు ఉంది. వేసవి ఎండల తీవ్రత నుంచి ఉపశమనం పొందడానికి కొండపైకి వస్తున్న సందర్శకుల తాకిడి నానాటికీ పెరుగుతోంది. జిల్లాకే తలమానికంగా నిలిచిన హార్సిలీహిల్స్ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టిని కేంద్రీకరించింది.

అంతులేని జలానుభూతి


ఉమ్మడి కడప జిల్లాలో 15 చిన్న, మధ్యతరహా, పెద్ద జలాశయాలున్నాయి. వీటి నిల్వ సామర్థ్యం 82.736 టీఎంసీలు. ప్రస్తుతం 56.05 టీఎంసీల నీరుంది. గండికోట, బ్రహ్మంసాగర్, పీబీఆర్, మైలవరం, పైడిపాళెం, బుగ్గవంక, వెలిగల్లు, అన్నమయ్య, దిగువ సగిలేరు, ఎస్‌ఆర్‌-1, ఎస్‌ఆర్‌-2 జలాశయాలు పర్యాటక కేంద్రాలుగా ప్రాచుర్యం పొందాయి. ఇక్కడే కాకుండా సోమశిల వెనుక జలాల ప్రాంతంలో అంతులేని జలానుభూతి పొందొచ్చు. ఇక్కడ విదేశీ విహంగాలు సందడి చేస్తున్నాయి. శేషాచలం, పాలకొండలు, లంకమల, నల్లమల, వెలిగొండల్లో అరుదైన అటవీ సంపద ఉంది. ఎన్నో వన్యప్రాణులు, పక్షులు కనువిందు చేస్తున్నాయి. జలపాతాలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

నవాబుల గడ్డ గుర్రంకొండ



గుర్రంకొండలోని రంగినీ మహల్

విజయనగర రాజులతో అంకురార్పణ జరిగి టిప్పుసుల్తాన్‌తో అనుబంధం పెంచుకుని బ్రిటీష్ చక్రవర్తులకు సైతం అంతుబట్టని విషయాలను తనలో దాచుకున్న చారిత్రక ప్రాంతం గుర్రంకొండ ఖిల్లా... చరిత్ర పుటల్లో తనకంటూ ప్రాధాన్యం సంతరించుకుని నేడు పర్యాటక కేంద్రంగా విలసిల్లుతోంది. నాటి వైభవానికి, మతసామరస్యానికీ ప్రతీకగా నిలుస్తోంది. కోట ఆవరణంలో ప్రత్యేక అలంకరణలతో నిర్మితమైన భవనాలు, కొండ కింది భాగంలో శ్రీవినాయక, ఆంజనేయస్వామి, కొండ పైన శ్రీలక్ష్మీనరసింహస్వామి భక్తులకు దర్శనమిస్తారు. కోట ప్రాంతంలో మతసామరస్యాన్ని మరవకుండా దర్గాలు వెలిశాయి. టిప్పు సుల్తాన్ గురువు సయ్యద్‌షా వలీ బుకారీ ఇక్కడే నివాసం ఉంటూ ఎందరికో మార్గదర్శకంగా నిలిచారు. గురువులకు నిలయం గుర్రంకొండని పిలవబడుతోంది. శక్తి సామర్థ్యాలకు నిలయంగా ఉండిన గుర్రపు శాల నిలువుటద్దంగా దర్శనమిస్తోంది. ఇలాంటి ఎన్నో చారిత్రక, పర్యాటక కేంద్రాలకు నిలయం ఈ ప్రాంతం.



\- న్యూస్‌టుడే, ఒంటిమిట్ట, బి.కొత్తకోట, గుర్రంకొండ

ఆహ్లాదం... ఆధ్యాత్మికం... సాంస్కృతిక, సేవా కార్యక్రమాలు... ఇవన్నీ ఒకే గడ్డపై కనువిందు చేస్తే విరబూసే మానసికోల్లాసం అనిర్వచనీయం. తొలకరికి పులకరించే నేలతల్లి మట్టివాసన, చూడగానే ఆకర్షించే సువిశాలమైన పచ్చిక బైళ్లు, ఉవ్వెత్తున ఎగిసిపడే ఫౌంటెన్ల సవ్వడి, నివ్వెరపోయే పర్వత ఆకృతులు, వేల సంఖ్యలో సందర్శకులు ప్రకృతి రమణీయతను ఆస్వాదిస్తుంటే ఆ అనుభూతి వర్ణనాతీతం. నిశిరాత్రిలో విరజిమ్ముతున్న వెన్నెలను మైమరింపజేసేలా ప్రకాశిస్తూ, వందల ఏళ్లుగా చరిత్ర పుటల్లో చెరగని ముద్ర వేసుకున్న కడప గడప పవిత్ర పుణ్యధామం. అంతులేని ఆధ్యాత్మిక రహస్యాలకు నిలయం. నిర్మాణ శైలి లావణ్యం... రాజసం చూడాలంటే వేయికళ్లయినా సరిపోవనే మన పూర్వీకులు మన గడ్డకు ఎనలేని కీర్తి తీసుకొచ్చారు. ఇప్పటికీ ఆ వైభవం దేదీప్యమానంగా ప్రకాశిస్తోంది. సందర్శకుల మది దోచే ఎన్నో ఆహ్లాదకరభరిత దర్శనీయ కేంద్రాలు, మరెన్నో వారసత్వ కట్టడాలకు నిలయంగా మారింది మన ఉమ్మడి కడప జిల్లా. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా మన గడ్డకు వెళ్లొద్దాం రండి!

మధ్య కైలాసం.. పుష్పగిరి

పెన్నానది ఒడ్డున కొలువైన పుష్పగిరి క్షేత్రం మధ్య కైలాసంగా దేశంలో ప్రసిద్ధి చెందింది. కాశీ, గయ, ప్రయాగ క్షేత్రాలన్నీ ఇక్కడే ఉన్నాయని పురాణాలు చాటుతున్నాయి. ఇక్కడి చెన్నకేశవ, శివాలయాలు, త్రికోటేశ్వర, దుర్గాదేవి మందిరాలు కోమలమైన శిల్పకళా విన్యాసాలతో ఆకట్టుకుంటున్నాయి. ప్రకృతి సౌందర్యం ఒడిలో ఆధ్యాత్మిక పెన్నిధిగా భాసిల్లుతోంది. ప్రాచీన వైష్ణవ క్షేత్రంగా విరాజిల్లుతోంది.

మట్లిరాజుల వైభవ చిహ్నం సిద్దవటం



జ్యోతి క్షేత్రం శ్రీశైల దక్షిణ ద్వారంగా ఎనలేని కీర్తి పొందింది. పినాకినీ ఒడ్డున 35 ఎకరాల సమతల మైదానంలో నిర్మించిన సిద్దవటం కోటకు ఘనమైన చరిత్ర ఉంది. మట్లి రాజులు పాలనలో నిర్మితమైంది. రాతితో మలచిన తోరణాలు, నృత్య కన్యలు, కళా, సభా మంటపం, దర్గా చూడొచ్చు. ఇక్కడ 18 రాజవంశస్థులు పాలించారు. జిల్లా కేంద్రంగా 1807 నుంచి 1812 వరకు కొనసాగింది. కోట వెలుపల సిద్ధేశ్వర, రంగ నాథ ఆలయాలున్నాయి. జ్యోతి గ్రామంలో శ్రీశైలం క్షేత్రానికి అనుబంధంగా జ్యోతి ఆలయం కొలువైంది.

కోదండరాముడి దివ్యధామం ఒంటిమిట్ట



ఒంటిమిట్ట కోదండ రామాలయం మహిమాన్విత భవ్య క్షేత్రంగా విరాజిల్లుతోంది. భక్తుల కొంగుబంగారం. చోళ, విద్యానగర, మట్లి రాజుల కాలంలో ఈ దివ్యధామం అభివృద్ధి చెందింది. గర్భాలయంలో ఏకశిలపై సీతారామలక్ష్మణమూర్తులు కొలువై ఉండటంతో ఏకశిలానగరిగా ఖ్యాతి సంతరించుకుంది. మూలవరులకు జాంబవంతుడు ప్రాణప్రతిష్ఠ చేశారని పురాణగాథ. తూర్పు, దక్షిణ, ఉత్తర దిశల్లో మూడు ఎత్తయిన గోపురాలు, 32 స్తంభాలతో రంగ మండపం నిర్మాణశైలి అబ్బురపరుస్తోందని ఈ క్షేత్ర సందర్శకులు మధురానుభూతి పంచుకుంటున్నారు. ఈ ఆలయాన్ని 2015 సెప్టెంబరు 9న తితిదేలోకి విలీనం చేశారు. భక్తులకు మౌలిక వసతులు, అభివృద్ధి పనుల కోసం రూ.65 కోట్లు వెచ్చించారు. ముఖ మండపం, అంతరాలయం, గర్భగుడిలో కడప నాపరాయి తొలగించి చలువరాయి పరిచే పనులకు శ్రీకారం చుట్టారు. విమాన గోపురం పైన కళాహీనంగా ఉన్న శిల్పాలకు పూర్వాకృతి తీసుకురావాలని ఇటీవల అనుమతిచ్చారు.

భానుడి కిరణాలు సౌమ్యనాథుడిపై...



నందలూరు సౌమ్యనాథుడు విలక్షణ దైవం. అతి పెద్ద ఆలయమిది. పెద్ద ప్రాకారం. ఈ క్షేత్రాన్ని 11వ శతాబ్దంలో చోళులు నిర్మించారు. ఎందరో చక్రవర్తులు, రాజులు పాలించారు. పురాణ, చారిత్రక యశస్సుకు సజీవ తార్కాణం. గత వైభవానికి ప్రత్యక్ష నిదర్శనంగా భాసిల్లుతోంది. అపురూప సౌందర్యమైన నిర్మాణ చతురతకు కొలవు. అద్భుత శిల్పకళా పాటవానికి నెలవు. బహుదానది ఒడ్డున కొలువైన ఈ దివ్య మందిరం ఎనలేని ఖ్యాతి పొందింది. భానుడి లేలేత కాంతి కిరణాలు ఈ స్వామిపై ప్రసరించేలా వాస్తు నిర్మాణ రీతి అత్యద్భుతం. అన్నమయ్య, క్షేత్రయ్య, కాకతీయ, చోళ, పాండ్య, విజయనగర రాజులు సౌమ్యనాథుని సేవలో తరించారు. ఒకనాడు పసిడి పళ్లెరాలతో ఈ దివ్యమూర్తి హారతులు అందుకున్నారు. ముఖ మండపం 108 స్తంభాల సమన్వితంగా నెలకొంది. మంటపంలో చెక్కిన శిల్పాలు భాగవత గాథల్ని ఆవిష్కరించారు. నందలూరుకు సమీపంలోనే బౌద్ధారామాలను సందర్శించవచ్చు.

పరశురామ క్షేత్రం.. రెండో గయ హత్యరాల

రాజంపేట మండలం బాహుదా నదీతీరంలో హత్యరాల పరశురామ క్షేత్రం రెండో గయగా ఖ్యాతి పొందింది. అద్భుత సౌందర్యాన్నంతా తనలో లీనం చేసుకున్న సుందర సరోవరం. 72 స్తంభాల బౌద్ధ కేంద్రం. గదాధర, త్రేతేశ్వర పరశు రామాలయాలు ఇక్కడ చూడదగిన ప్రాంతాలు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



సాయిసుధా (పాత చిత్రం)

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన ఘటన గురువారం పీలేరు మండలంలో చోటు చేసుకుంది. ఎస్.ఐ. బాలకృష్ణ కథనం మేరకు... మండలంలోని బోడుమల్లువారిపల్లె పంచాయతీ మొరవపల్లె చెరువులో మహిళ మృతదేహం తేలియాడుతున్నట్లు స్థానికులు సమాచారం అందించారు. పీలేరు అగ్నిమాపక సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పారిశుద్ధ్య కార్మికుడి సాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహం బాగా కుళ్లిన స్థితిలో ఉండడంతో పరిసర ప్రాంతాల్లో ఆరా తీయడంతో మృతురాలి ఆచూకీ లభ్యమైంది. స్థానికంగా ఇటుకల బట్టీలో పని చేసే తమిళనాడుకు చెందిన మణి భార్య సాయిసుధా (25)గా గుర్తించారు. మంగళవారం రాత్రి భార్య, భర్త గొడవ పడ్డారు. అప్పటి నుంచి భార్య కనబడకుండా పోయిందని మణి చెప్పారు. మృతురాలికి స్నేహ, క్రిష్ణదేవ ఇద్దరు పిల్లలు. నడుముకు రాయి కట్టి ఉండడంతో ఎవరైనా హత్యచేసి రాయికట్టి చెరువులో పడేశారా? అన్న కోణంలో విచారణ జరుపుతామని ఎస్.ఐ. తెలిపారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి...

మదనపల్లె నేరవార్తలు : ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి చెందినట్లు రూరల్ సీఐ కళా వెంకటరమణ తెలిపారు. పట్టణంలోని చంద్రాకాలనీకి చెందిన మధుకర్‌రెడ్డి (40)కి మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ మామిడిగుంపులపల్లెకు చెందిన నందినితో అయిదు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి పిల్లలు లేరు. కుటుంబ కలహాలతో 15 రోజుల క్రితం ఆమె అలిగి పుట్టింటికి వెళ్లింది. దీంతో భార్యను కాపురానికి పంపాలని ఈ నెల 16వ తేదీన అత్తగారింటికి వెళ్లి అడిగాడు. నందినిని కాపురానికి పంపడం కుదరదని చెప్పడంతో మనస్తాపానికి గురైన అతను అదే రోజు అత్తగారింట్లోనే పురుగు మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు అతన్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృత్యువాతపడ్డాడు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తాళం పగలగొట్టి ఇంట్లో చోరీ

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బంగారు, నగదు అపహరించుకుని వెళ్లిన ఘటన మదనపల్లె మండలంలో బుధవారం రాత్రి జరిగింది. కొత్తవారిపల్లె పంచాయతీ పూలవాండ్లపల్లెకు చెందిన రెడ్డిమోహన్ ఈ నెల 25వ తేదీన అనారోగ్యంగా ఉండటంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి వెళ్లాడు. గురువారం ఉదయాన్నే తిరిగి స్వగ్రామానికి వెళ్లాడు. ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో లోనికి వెళ్లి చూసి చోరీ జరిగినట్లు గుర్తించి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సీఐ కళా వెంకటరమణ ఆదేశానుసారం ఎస్ఐ చంద్రమోహన్ గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించారు. ఇంట్లో ఉన్న రూ.80 వేలు విలువైన 16 గ్రాముల బంగారు, రూ.17 వేలు నగదు అపహరించుకుని వెళ్లినట్లు బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సంక్షోభంలో సంక్షేమం కూటమికే సాధ్యం

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే : సంక్షోభ పరిస్థితుల్లో సంక్షేమ పథకాలు అందజేయడం కూటమి ప్రభుత్వానికే సాధ్యమైందని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో భాగంగా గురువారం మండలంలోని గర్నిమిట్టలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను విడతల వారీగా అమలు చేస్తామని చెప్పారు. వైకాపా పాలనంతా అక్రమాలు, కబ్జాలు, దౌర్జన్యాలేనని అన్నారు. అందుకే వారికి ప్రజలు 11 సీట్లకే పరిమితం చేశారని తెలిపారు. తెదేపా పాలనలో ఎక్కడా అవినీతి, అక్రమాలకు అవకాశం లేదని, ఎవరైనా అవినీతికి పాల్పడినా, చెరువులు, కుంటలు, భూకబ్జాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తహసీల్దారును ఆదేశించారు. ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిపించినందుకు ప్రజలకు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. ఎన్నికల హామీలో భాగంగా దీపావళికి ఉచిత సిలిండర్ల పంపిణీ జరుగుతుందని చెప్పారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని పేర్కొన్నారు. అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు రాయితీ ఉలవల పంపిణీని ప్రారంభించారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించి, మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. తెదేపా మండలశాఖ అధ్యక్షరాలు గీతాంజలి, నాయకులు రఘురామిరెడ్డి, సురేష్‌రెడ్డి, గంగిరెడ్డి, యంజీవీ రమణ, గాలి సుధాకర్ నాయుడు, మహేంద్రరెడ్డి, గిరిబాబు, వెంకట్రమణనాయుడు, రవిచంద్రారెడ్డి, యర్రంరెడ్డి, శివారెడ్డి, ధనుంజయ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి, పక్కన నాయకులు

ఆస్తి కోసం కన్నతల్లిని కడతేర్చిన కుమారుడు

కోడలు సహా నిందితుడి అరెస్టు... రిమాండుకు తరలింపు

ములకలచెరువు, న్యూస్‌టుడే : ఆస్తి కోసం కన్న తల్లినే కడతేర్చిన కుమారుడు, కోడలిని అరెస్టు చేసినట్లు ములకలచెరువు సీఐ రాజారమేష్ తెలిపారు. ములకలచెరువులోని కదిరి రోడ్డుకు చెందిన హైదర్‌వల్లీ భార్య షఫియా బేగం (55) దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. అయితే షఫియా బేగం కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామన్నారు. ఆదివారం రాత్రి ఆమె కుమారుడు చిన్నరెడ్డిబాషా, కోడలు హర్షియాలు కొట్టి గొంతుకోసి చంపేశారని విచారణలో తేలిందన్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అయితే చిన్న కుమారుడు చిన్నరెడ్డిబాషా ఆస్తి మొత్తం తనకే చెందాలని గత కొంతకాలంగా తల్లితో తరచూ గొడవ పడేవారని తెలిపారు. ఏడాది క్రితం షఫియా బేగం భర్త హైదర్‌వల్లీ మృతి చెందారు. హత్య కేసులోని నిందితులను గురువారం తంబళ్లపల్లె క్రాస్ వద్ద అరెస్టు చేసి హత్యకు ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండుకు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.ఐ. గాయత్రి ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఏపీటీఎఫ్ సభ్యులు డీఈవో శివప్రకాశ్‌కు వినతిపత్రం ఇచ్చారు. . జీవో 117ను వెంటనే రద్దు చేయాలని కోరారు. పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ సభ్యులు శ్రీనివాసులు, గిరిబాబు, మహమ్మద్ అలీ, మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా గుడిలో జనసేన నాయకుల దీక్ష

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా మదనపల్లెలో ఆ పార్టీ నాయకులు నిరసన దీక్ష చేపట్టారు. పట్టణంలోని బర్మావీధిలో ఉన్న సాయిబాబా గుడి ప్రాంగణంలో జనసేన పార్టీ రాయలసీమ రీజినల్ కోఆర్డినేటర్ దారం అనిత అధ్వర్యంలో నిరసన దీక్ష చేశారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. తమ నాయకుడు పవన్‌కల్యాణ్ చేపట్టిన దీక్షకు అన్ని వర్గాల ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తుందన్నారు. తిరుమల లడ్డూను అపవిత్రం చేసిన వారిని శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో జనసేనపార్టీ నాయకులు హరిప్రసాద్, అశ్వత్, కె.చంద్రశేఖర్, మల్లికార్జున, ఎ.శంకర, శ్రీనివాసులు, అరుణ, ప్రశాంత్, ధరణి, శ్రీనాథ్, రమణ, మారుతీ, తులసి, రమణ, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.



ఉప ముఖ్యమంత్రి దీక్షకు సంఘీభావంగా సాయిబాబా ఆలయంలో బైఠాయించిన జనసేన పార్టీ రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్ దారం అనిత, నాయకులు

కబ్జాదారులను వదిలే ప్రసక్తే లేదు

కార్యదర్శి, వీఆర్వోల సస్పెన్షన్‌కు ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆదేశం

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: సీటీఎం-2 పంచాయతీలో భూకబ్జాలకు పాల్పడిన వారినెవ్వరినీ వదిలే ప్రసక్తేలేదని, వారిపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. గురువారం గ్రామీణ మండలం సీటీఎం-2 పంచాయతీ కేంద్రంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం'తో పాటు 'ప్రజాదర్బార్' కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ సర్పంచికి సంబంధించిన వైకాపా నాయకులు గ్రామంలో శ్మశానవాటికను ఆక్రమించుకోవడం జరిగిందని, గ్రంథాలయం పేరుతో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని భాజపా నాయకులు కిరణ్ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన స్పందించి కొత్తవారిపల్లె పంచాయతీ వీఆర్వో, కార్యదర్శులు ఏం చేస్తున్నారని, కబ్జా చేస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. వారిని ఉద్యోగాల నుంచి సస్పెండ్ చేయడానికి సిఫార్సు చేయాలని తహసీల్దార్ ఖాజాబీ, ఎంపీడీవో భానుప్రసాద్‌ను ఆదేశించారు. ఈ పంచాయతీల్లో వైకాపా నాయకులు ప్రభుత్వ భూములను కబ్జా చేశారని, సీటీఎం చెరువును ఆక్రమించేశారని, వీటిపై సర్వే చేసి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు. నిరుపేదలకు ఇచ్చిన ఇంటి పట్టాలకు సంబంధించి స్థలాలను కూడా కాజేశారని, ప్రభుత్వ ఇంటి స్థలాలు విక్రయించారని ఫిర్యాదులు వచ్చాయన్నారు. పంచాయతీలో జరిగిన అక్రమాలపై గ్రామ ప్రజలు ఒక పుస్తకం ఇచ్చారని, అవి పరిశీలించి వాటిపై చర్యలు తీసుకుంటామని, భూకబ్జాలపై బాధితులు ఎవరూ ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని తనకు నేరుగా ఫిర్యాదు చేస్తే వీటిపై తక్షణం విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. సీటీఎం పెద్దచెరువు ఆక్రమణలు జరిగాయని, దీనిపై సర్వే చేయిస్తామని, అక్రమ నిర్మాణాలను స్వాధీనం చేసుకుని ప్రభుత్వ కార్యాలయాలకు వినియోగిస్తామన్నారు. ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమ పరిశీలకులు శివరాం ప్రతాప్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి ప్రజా సంక్షేమానికి, అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో చీకలబైలు సర్పంచి ప్రభాకర్, టౌన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ విద్యాసాగర్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రంగప్ప, వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గుర్రప్ప నాయుడు, కూటమి సీనియర్ నాయకులు దారం అనిత, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, చంద్రశేఖర్, నరసింహులు, సుధాకర్, రెడ్డి రాంప్రసాద్, కూటమి నాయకులు ప్రభాకర్, శ్రీనివాసులు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తవారిపల్లె వీఆర్వో, కార్యదర్శులను నిలదీస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, పక్కన పరిశీలకులు శివరాంప్రతాప్, నాయకులు

ఇళ్ల నిర్మాణాల్లో లక్ష్యాలు పూర్తి చేయండి

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ గృహ నిర్మాణాల్లో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, మండల ప్రత్యేక అధికారులు అన్ని మండలాల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల ప్రక్రియపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించి పురోగతిని తీసుకురావాలన్నారు. సమావేశంలో రాజంపేట సబ్ కలెక్టర్ నైదియా దేవి, హౌసింగ్ శాఖ పీడీ శివయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

టికెట్లు బ్లాక్ చేశారని ఆందోళన



థియేటర్ ఎదుట నినాదాలు చేస్తున్న అభిమానులు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : సినిమా టికెట్లు బ్లాక్ చేసి అభిమానులకు అన్యాయం చేస్తున్నారని మదనపల్లెలోని ఓ థియేటర్ ఎదుట మదనపల్లె ఎన్టీఆర్ అభిమాన సంఘం అధ్యక్షుడు రాజేష్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. మదనపల్లెలోని పలు థియేటర్లలో దేవర సినిమా శుక్రవారం విడుదల కానుందన్నారు. ఈ నేపథ్యంలో థియేటర్ల యజమానులు ఆన్‌లైన్‌లో టికెట్లు విడుదల చేయకుండా బ్లాక్ చేసి వాటిని అధిక ధరలకు విక్రయించుకుంటున్నారని ఆరోపించారు. మదనపల్లెలో బుధవారం రాత్రి 10.20 గంటలకు టికెట్లు విడుదల చేశారని, కేవలం అయిదు నిమిషాల్లోనే టికెట్లు అమ్ముడుపోయినట్లు చూపించారన్నారు. దీనిపై కలెక్టర్‌తో పాటు మదనపల్లె సబ్‌కలెక్టర్, పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆందోళనలో మదనపల్లె ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు ప్రవీణ్, రెడ్డి, గణేష్, నాగేంద్ర, సాయి, పండుతో పాటు పలువురు ఉన్నారు.

మదనపల్లె

•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సైన్స్ ఫోరం నాయకులు

పాఠ్యాంశాలపై అవగాహన

మదనపల్లె విద్య: కొత్తగా మారిన పాఠ్య పుస్తకాలపై ఉపాధ్యాయులు అవగాహన పెంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు భాస్కరన్, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మారిన విద్యా అవసరాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమ విద్యాబోధనను మెరుగుపర్చుకోవాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

కలికిరి, (వాల్మీకిపురం): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ అన్నారు. గురువారం వాల్మీకిపురం మండలం చింతపర్తి పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో నీరు నిల్వ ఉంచుకున్న డ్రమ్ములు, బకెట్లు పరిశీలించి లార్వాలను గుర్తించారు. అనంతరం చింతపర్తి బీసీ, సోషల్ వెల్ఫేర్ బాలుర వసతి గృహాలను సందర్శించారు. కార్యక్రమంలో వైద్యులు ఆయిషా, సిబ్బంది పాల్గొన్నారు.



చింతపర్తి వసతి గృహంలో పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్

బోగస్ పట్టాలపై విచారణ

గుర్రంకొండ : గుర్రంకొండలోని కాలనీలో బోగస్ పట్టాలపై గురువారం తహసీల్దారు శ్రీనివాసులు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారుల వద్దకు వెళ్లి పట్టాలను పరిశీలించి, విచారించారు. పూర్తిస్థాయి నివేదికను కలెక్టరుకు పంపుతున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమానికి తప్పిపోయిన బాలుడు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : తప్పిపోయి పట్టణంలో తిరుగుతున్న బాలుడిని మదనపల్లె రూరల్ ఎస్ఐ హరిహరప్రసాద్ చైతన్య అనాథాశ్రమానికి తరలించారు. బుధవారం రాత్రి ఎస్టేట్ ప్రాంతంలో అయిదు సంవత్సరాల వయస్సున్న బాలుడు తిరుగుతుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో రూరల్ ఎస్ఐ హరిహరప్రసాద్ అటుగా వెళ్తూ బాలుడిని తీసుకుని చుట్టుపక్కల కుటుంబ సభ్యుల కోసం గాలించారు. అయితే బాలుడికి చెందిన కుటుంబ సభ్యుల ఆచూకీ దొరక్కపోవడంతో మదనపల్లె మండలం సీటీఎం రోడ్డులో ఉన్న చైతన్య ఆశ్రమానికి అప్పగించారు. ఆశ్రమ నిర్వాహకురాలు కవితారాణి, సిబ్బంది బాలుడిని అక్కున చేర్చుకున్నారు. బాలుడి కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే వచ్చి తీసుకెళ్లాలని ఎస్ఐ కోరారు.

చేనేతల సమస్యలు పరిష్కరించండి

కలకడ: జిల్లాలోని చేనేత కార్మిక సమస్యలను పరిష్కరించాలని జిల్లా చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకులు కృష్ణను చేనేత కార్మిక యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గుడిటి గురుస్వామి కలసి విన్నవించారు. గురువారం ఆయన్ను రాయచోటిలోని చేనేత కార్యాలయంలో కలిసి చేనేత కార్మిక సమస్యలు పరిష్కారంతో పాటు సంక్షేమ పథకాలు అందరికి అందేలా చూడాలని కోరినట్లు పేర్కొన్నారు. ఆయనతో పాటు చేనేత కార్మికనాయకులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల విజయవంతానికి కృషి

కలికిరి, (వాల్మీకిపురం) న్యూస్‌టుడే: వాల్మీకిపురంలో గండబోయనపల్లి రోడ్డులో వెలసిన శ్రీసత్యమ్మ తల్లి దసరా ఉత్సవాలు విజయవంతానికి ఆలయ కమిటీ ఛైర్మన్, రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు పులి సత్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆలయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమ్మవారి భక్తులు, గ్రామస్థులు ఐకమత్యంతో దసరా ఉత్సవాలను విజయవంతం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సత్యనారాయణరెడ్డి సభ్యులకు తెలిపారు.

తెదేపా నాయకుడి ఆటోకు నిప్పు

ములకలచెరువు, న్యూస్‌టుడే : తంబళ్లపల్లె మండలంలో బుధవారం అర్ధరాత్రి ఘోరం చోటు చేసుకుంది. తంబళ్లపల్లె మండలం, గోపిదిన్నె పంచాయతీ, బల్లాపురంపల్లెకు చెందిన తెదేపా సీనియర్ నాయకుడు వీరాంజనేయులుకు చెందిన ఆటోకు బుధవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు నిప్పంటించారు. ఈ ఘటనపై గురువారం బాధితుడు తంబళ్లపల్లె పోలీస్ ఠాణాలో ఫిర్యాదు చేశాడు. మండలంలోని బల్లాపురంపల్లిలో గత ఎన్నికలు జరిగిన పుటి నుంచి తెదేపా, వైకాపా వర్గాల మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. వినాయకచవితి వేడుకల్లో భాగంగా ఇరువర్గాల మధ్య ఘర్షణలు తలెత్తగా పోలీసులను ఆశ్రయించి సమస్యను పరిష్కరించుకున్నారు. ఇటీవల వైకాపా వర్గీయుల నుంచి తెదేపా సీనియర్ నాయకుడు వీరాంజనేయులు కొంత వ్యవసాయ భూమిని కొనుగోలు చేశాడు. అప్పటి నుంచి గ్రామంలో ఉన్న పలువురు వైకాపా వర్గీయులు వీరాంజనేయులుపై కక్ష పెంచుకున్నారు. ఈ నేపథ్యంలో వీరాంజనేయులు ఆటో మరమ్మతులకు గురికావడంతో బుధవారం గ్రామానికి వచ్చే రోడ్డులో ఓ వైపు ఉంచాడు. బుధవారం అర్ధరాత్రి సమయంలో టమాటాలను మార్కెట్‌కు తరలించేందుకు గ్రామానికి వచ్చిన వాహన డ్రైవర్ ఆటో మంటల్లో కాలిపోతున్న విషయాన్ని గమనించి తమకు సమాచారం ఇచ్చాడన్నారు. వెంటనే ఆటో పెట్టిన స్థలానికి వెళ్లి చూడగా అప్పటికే ఆటో మంటల్లో పూర్తిగా కాలిపోయిందన్నారు. తనపై కక్షతో గ్రామానికి చెందిన వీరాంజనేయరెడ్డి, వెంకటరమణారెడ్డి, విజయకుమార్‌రెడ్డిలు ఆటోకు నిప్పు పెట్టినట్లు అనుమానం ఉందని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు

కలికిరి, న్యూస్‌టుడే: మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి తనయుడు నిఖిలేష్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం కలికిరి భాజపా కార్యాలయంలో నాయకులు ఏర్పాటు చేసిన కేకును తన తండ్రి మాజీ సీఎం, భాజపా జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కోసి జన్మదిన వేడుకను నిరాడంబరంగా జరుపుకొన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు పులి సత్యనారాయణరెడ్డి, భాజపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో ఆదాయ వనరులు



కూలీలతో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

ములకలచెరువు, న్యూస్‌టుడే : ఉపాధి పనులతో ఆదాయ వనరులు పెంచుకొని ఆర్థికాభివృద్ధితో జీవనోపాధిని పెంచుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సమన్వయకర్త సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం ములకలచెరువు మండలంలోని ములకలచెరువు, సోంపల్లి, దేవుళచెరువు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డ్వాక్రా మహిళలు వెలుగు సంఘాల ద్వారా అందించే రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. పంచాయతీ గ్రామసభల్లో భాగస్వాములై పంచాయతీ వనరుల అభివృద్ధికి ప్రణాళికలు రచించుకోవాలన్నారు. ప్రతి మహిళ వ్యాపారవేత్తగా ఎదిగేందుకు కేంద్ర ప్రభుత్వం విరివిగా రుణాలు మంజూరు ి చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు తెలిపారు. 2023-24లో కేంద్రం అందించిన సంక్షేమ పథకాలతో ఎంతమంది లబ్ధిపొందారో వివరాలు సేకరించారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో గౌస్‌బాషా, ఏపీఎం హరినాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాలచంద్రాచారి తదితరులు ఉన్నారు.

అక్షయ పాత్రలా అన్న క్యాంటీన్లు

* మూడు పూటలా కడుపునిండా ఆహారం
* రోజూ 2 వేల మందికి కడుపు నిండా తిండి



వారపుసంతలోని అన్న క్యాంటీన్

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : బయట హోటళ్లలో కడుపునిండా భోజనం చేయాలంటే రూ.70 నుంచి రూ.100 ఖర్చు చేయాలి. ఉదయం అల్పాహారమైతే రూ.50 తగ్గదు. ఇంత మొత్తం వెచ్చించి పేద వారు రుచికరమైన భోజనం చేయలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన రెండు నెలలలోపే ఇచ్చిన మాట ప్రకారం పేదల ఆకలిని తీర్చడానికి అన్న క్యాంటీన్లను ఆగస్టు 16వ తేదీ పునః ప్రారంభించారు. ఆ రోజు నుంచి అన్న క్యాంటీన్లలో రోజు రూ.5లకే భోజనం పెడుతున్నారు. దీంతో అన్నార్థులు, పేద ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న అన్నార్థులు

పట్టణంలో రెండు క్యాంటీన్లు

మదనపల్లె పురపాలక సంఘం వారపు సంత, టమాట మార్కెట్‌యార్డు వద్ద అన్న క్యాంటీన్లను గత నెల 16వ తేదీ మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ పునఃప్రారంభించారు. వారపు సంతలోని క్యాంటీన్‌లో ఉదయం 150 నుంచి 200 మందికి అల్పాహారం పెడుతున్నారు. మధ్యాహ్నం, రాత్రి వేళల్లో కలుపుకొని 700 మందికి రూ.5లకే అన్నం పెడుతున్నారు. నీరుగట్టువారిపల్లె అన్న క్యాంటీన్‌లో వెయ్యి మందికిపైగా అన్నం పెడుతున్నారు. మెనూ ప్రకారం అక్షయ పాత్ర ట్రస్టు వారు ఉదయం టిఫన్, మధ్యాహ్నం భోజనం పెడుతున్నారు. రూ.5 లకు భోజనంతో పాటు పాటు ఒక కర్రి, సాంబారు, పెరుగు ఇస్తున్నారు.


కూటమితో కడుపునిండా తిండి



నేను వారపుసంతలో దినసరి కూలీగా పనిచేస్తున్నా. రోజు మధ్యాహ్న సమయంలో భోజనం చేయడానికి ఇబ్బందిపడేవాడిని. ఒక్కో రోజు ఇంటికి వెళ్లలేక పస్తులుండేవాడిని. అన్న క్యాంటీన్ ప్రారంభించినప్పటి నుంచి రూ.5లు ఇచ్చి తృప్తిగా భోంచేస్తున్నా. కూటమి రాకతో కడుపునిండుతోంది.

\- కృష్ణమూర్తి, వారపుసంత

చంద్రబాబు చల్లగా ఉండాలి



రూ.5లకే భోజనం పెడుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చల్లగా ఉండాలి. ఈ రోజుల్లో రూ.5లకు టీ కూడా రాదు. అలాంటిది పేదవారికి రూ.5లకే అన్నం పెట్టడం అభినందనీయం. ధనార్జనకు ప్రాధాన్యం ఇవ్వకుండా పేదవారి కడుపునింపడం మంచి నిర్ణయం. రోజూ ఆకలితో పస్తులుంటున్న ఎంతో మందికి అన్నం పెడుతున్నారు.

\- చంద్రయ్య, నీరుగట్టువారిపల్లె, మదనపల్లె

భోజనం చేసే వెళ్తాం



మదనపల్లెకు వస్తే తప్పకుండా అన్న క్యాంటీన్‌కు వెళ్లి భోజనం చేసి వెళ్తాం. ఒకప్పుడు అన్నం తినాలంటే రూ.70 పెట్టాల్సి వచ్చేది. ఇప్పుడు అన్న క్యాంటీన్‌లో రూ.5లకే భోజనం కడుపునిండా పెడుతున్నారు. మధ్యాహ్నం భోజనంలో రసం ఏర్పాటు చేస్తే బాగుంటుంది. నాణ్యత, రుచి చాలా బాగుంది.

\- నాగరాజు, సందిరెడ్డిపల్లె, మదనపల్లె

వరద బాధితులకు విద్యార్థుల విరాళం

మదనపల్లె విద్య: విజయవాడలో వరదల దాటికి సర్వస్వం కోల్పోయిన బాధితులకు తమవంతు సాయంగా మదనపల్లె యూత్ కరాటే క్లబ్ విద్యార్థులు రూ.22,250 విరాళంగా అందజేశారు. కరాటే మాస్టర్ డాక్టర్ ఏఆర్ సురేష్ ఆధ్వర్యంలో విద్యార్థులంతా తమకు తోచిన సాయం అందించారు. మొత్తం నగదును ముఖ్యమంత్రి సహాయనిధి పేరుతో చెక్కు తీసి గురువారం మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కరాటే మాస్టర్‌తో పాటు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో బ్లాక్ బెల్ట్ విద్యార్థులు మహేశ్వర్, మహమ్మద్ ఐమాన్, మెహిబుల్ రెహ్మాన్, ఎస్.కాలేషా, మస్తాన్, మహమ్మద్ ఉమ్మర్, కరాటే విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉలవ సాగుకు ప్రభుత్వం చేయూత

నిమ్మనపల్లె: బీడు భూముల్లో ఉలవ సాగు చేపట్టడానికి ప్రభుత్వం రాయితీపై ఉలవ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు రాజంపేట పార్లమెంటరీ తెదేపా మీడియా అధికార ప్రతినిధి రాజన్న, మాజీ సర్పంచి మల్లప్ప, తెదేపా నాయకులు కొత్తపల్లె శంకర అన్నారు. గురువారం నిమ్మనపల్లె వ్యవసాయ కార్యాలయం వద్ద ఉలవ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. తెదేపా నాయకులు శ్రీపతి, వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి చర్యలు

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని గ్రామాల్లో రహదారుల నిర్మాణాలకు చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. గురువారం మండలంలోని కోళ్లబైలు-1 పంచాయతీ పరిధిలోని వైఎస్ఆర్ కాలనీలో రూ.9 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత ప్రభుత్వం అభివృద్ధి పనులను విస్మరించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధి పనులపై దృష్టి పెడుతూనే ప్రజా సంక్షేమానికి అవసరమైన పథకాలను ప్రవేశపెడుతున్నారని, రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీఈ శివప్రసాద్, ఏఈ వెంకట రమణ, కార్యదర్శి రవినాయక్, సర్పంచి ఆనంద్‌రెడ్డి, మండల, పంచాయతీ ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పురపాలికలో ఆర్డీ విచారణ

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : పురపాలక కార్యాలయంలో ఆర్డీ విశ్వనాథ్ గురువారం విచారణ చేపట్టారు. పట్టణ ప్రణాళిక విభాగంలో ఎస్‌పీఓగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ప్రభాకర్ తనకు పింఛను మంజూరు చేయాలని కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలను అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అయితే ఆదేశాలను కమిషనర్లు అమలు చేయకపోవడంతో బాధితుడు మళ్లీ కోర్టును ఆశ్రయించాడు. దీనిపై విచారణకు వచ్చినట్లు ఆర్డీ విశ్వనాథ్ తెలిపారు. మదనపల్లె, ప్రొద్దుటూరు పురపాలక కమిషనర్లు రఘునాథరెడ్డి, ప్రమీలను విచారించినట్లు ఆయన తెలిపారు. ఆ తర్వాత కార్యాలయంలోని పలు విభాగాలకు చెందిన అధికారులను, సిబ్బందిని పిలిపించి పలు సూచనలు సలహాలు ఇచ్చారు.

ఎమ్మెల్సీకి కళాశాలల సంఘం వినతి

కురబలకోట: రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల సమస్యల్ని పరిష్కరించేందుకు తగిన కృషి చేయాలని రాయలసీమ కార్యదర్శి, గోల్డెన్ వ్యాలీ కళాశాల కరస్పాండెంట్ ఎన్వీ రమణారెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను అంగళ్లలోని గోల్డెన్ వ్యాలీ కళాశాలలో కరస్పాండెంట్ ఎన్వీ రమణారెడ్డి గురువారం సన్మానించారు. ఇందులో భాగంగా ఇంజినీరింగ్ కళాశాల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. తెదేపా నాయకులు కట్టా దొరస్వామినాయుడు, ఇతర తెదేపా కార్యకర్తలు పాల్గొన్నారు.

హమాలీల ఆందోళన

మదనపల్లె గ్రామీణ: హమాలీల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు దేవా డిమాండ్ చేశారు. గురువారం వ్యవసాయ మార్కెట్‌యార్డులోని పౌర సరఫరాలశాఖ గిడ్డంగికి వెళ్లే మార్గంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హమాలీలు నిరసన చేశారు. ఈ సందర్భంగా దేవా మాట్లాడుతూ... గిడ్డంగుల్లో పనిచేస్తున్న హమాలీలకు శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలని, ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని, కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. పెంచిన కూలీ ధరలను ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి అమలు చేస్తామని గత ప్రభుత్వం ప్రకటించినా ఇంత వరకు ఎలాంటి కార్యరూపం దాల్చలేదని, దీన్ని దృష్టి పెట్టుకుని ప్రభుత్వం జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు నరసింహులు, అయూబ్, విజయ్, వీరాంజనేయులు, ముబాకర్, జగదీష్, దిలీప్, ఆనంద్, నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక పరిషత్‌కు సహకరించాలి

మదనపల్లె అర్బన్: ఆర్టీసీ డిపోల పరిధిలో కొత్తగా ఏర్పాటైన కార్మిక పరిషత్‌కు సహకరించాలని ఆ సంఘం జోనల్ ప్రధాన కార్యదర్శి పురుషోత్తం ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే నివాసంలో గురువారం కార్మిక పరిషత్ కార్యవర్గ సభ్యులతో కలిసి పరిచయం చేసుకున్నారు. స్థానిక డిపోల పరిధిలో నెలకున్న సమస్యల పరిష్కారానికి సంబంధించి తగిన రీతిన స్పందించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేయగా, స్పందించిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా డీఎంకు ఫోన్ చేసి, కార్మిక పరిషత్ వినతిపత్రం అందిస్తే, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు కార్మిక పరిషత్ నాయకులు తెలిపారు. 1వ డిపో గౌరవాధ్యక్షులు జి.త్యాగరాజు, ప్రతినిధులు నాగరాజు, ఎం.రవీంద్రనాయక్, రాజు, ఆర్.జే.ఎన్.రెడ్డి, ప్రేమనాథరెడ్డి, ఐ.ఎన్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచాలి

వైద్యులకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ సూచన



తంబళ్లపల్లె సామాజిక ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, పక్కన రెవెన్యూ అధికారులు

ములకలచెరువు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ వైద్యులను ఆదేశించారు. గురువారం తంబళ్లపల్లె సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. వారంలోగా ఆపరేషన్ థియేటర్ ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. అనంతరం వైద్యులు, సిబ్బంది హాజరు పట్టిక పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరతపై ఆరా తీశారు. మందుల స్టాక్ రిజిస్టరును పరిశీలించి రిజిస్టర్ సరిగా నిర్వహించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సాధారణంగా ఒక పీహెచ్‌సీలో నెలకు 20 నుంచి 30 ప్రసవాలు జరుగుతుంటే సీహెచ్‌సీలో ఏడు ప్రసవాలు మాత్రమే జరుగుతున్నాయని, వెనుకబడిన ప్రాంతంలో ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి తనకు ప్రతిపాదిస్తే నిధులు మంజూరు చేస్తానని కలెక్టర్ పేర్కొన్నారు. ఆసుపత్రి స్థలం కూడా ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నాని స్థానికులు ఫిర్యాదు చేయగా దారి సమస్య పరిష్కరించాలని తహసీల్దారును ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం తంబళ్లపల్లె తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి మండలంలో జరుగుతున్న ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన, భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట తహసీల్దారు హరికుమార్, వైద్యాధికారి వెంకట్రామయ్య తదితరులు ఉన్నారు.

గంజాయి రహితంగా అన్నమయ్య జిల్లా

ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



రూరల్ స్టేషన్ వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : జిల్లాలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని గంజాయి రహితంగా అన్నమయ్య జిల్లాను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు అన్నారు. గురువారం ఆయన మదనపల్లె పట్టణంలోని ఒకటవ, రెండో పట్టణ, రూరల్ స్టేషన్, రూరల్ సర్కిల్ కార్యాలయాలతో పాటు పోలీసు వసతి గదులు, వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న పాత పోలీస్‌స్టేషన్, డీఎస్పీ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మదనపల్లెలో పోలీసు పరిధిలో ఉన్న స్థలాలను పరిశీలించినట్లు తెలిపారు. ప్రస్తుతం వసతి గృహాల్లో హోంగార్డులున్నారని వాటికి చిన్న చిన్న మరమ్మతులు చేయించేందుకు చూస్తున్నామన్నారు. అలాగే చోరీల నివారణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు. మదనపల్లె డివిజన్‌లో ఇటీవల గంజాయిపై పలు కేసులు నమోదు చేయడంతో పాటు 40 మందిని అరెస్టు చేశామన్నారు. సిబ్బంది పనితీరును ఆయన ప్రశంసించారు. మదనపల్లెలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు సీఐను ఏర్పాటు చేశామన్నారు. అయితే ట్రాఫిక్ స్టేషన్ ఏర్పాటు విషయమై పైఅధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయ దస్త్రాల దహనం కేసును సీఐడీ అధికారులు విచారణ చేస్తున్నారని ప్రస్తుతం ఇందులో పోలీసులు ఎలాంటి విచారణ చేయడం లేదన్నారు. ఎస్పీతో పాటు మదనపల్లె డీఎస్పీ కొండయ్యానాయుడు, సీఐలు చాంద్‌బాషా, రామచంద్ర, కళా వెంకటరమణ, రమేష్, చంద్రశేఖర్ తోప పాటు ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

సాగుకు కూటమి సర్కారు పెద్దపీట

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: వ్యవసాయ రంగానికి సంబంధించి ప్రభుత్వ పథకాలను ప్రవేశ పెట్టి, రైతుల కోసం అందుబాటులోకి తీసుకొచ్చిన వ్యవసాయ రంగ యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. గురువారం గ్రామీణ మండలం కొత్తవారిపల్లె, సీటీఎం-2 పంచాయతీ పరిధిలో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 'నమో డ్రోన్ దీదీ' పథకం ద్వారా మర్యాద రామన్న పట్నం ఎఫ్‌పీసీ వారికి అందించిన కిసాన్ డ్రోన్‌ను రైతులకు పంపిణీ చేసి, ప్రారంభించారు. అలాగే 80 శాతం రాయితీలో ఉలవ విత్తనాలను రైతులకు అందించారు. డ్రోన్ ద్వారా ఎకరాకు పది నిముషాల వ్యవధిలో చీడ పురుగుల నివారణకు మందులు పిచికారి చేసేందుకు అవకాశం ఉందని, ఎకరాకు కేవలం రూ.400ల అద్దెతో రైతులకు అందుబాటులో ఉంటుందని వ్యవసాయశాఖ ఏడీఏ శివశంకర్ వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు నాగప్రసాద్, ఎంపీడీవో భానుప్రసాద్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోటలో ఆర్టీసీ డిపోను పునఃప్రారంభిస్తామని తంబళ్లపల్లె తెదేపా నేత జయచంద్రారెడ్డి హామీ ఇచ్చారు. గురువారం బి.కొత్తకోట నగర పంచాయతీ కార్యాలయంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వార్డు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ... ఆర్టీసీ డిపో, బస్టాండుల నిర్మాణానికి దేవాదాయశాఖకు చెందిన భూమిని లీజుకు తీసుకునేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ఇసుక కొరత వల్ల భవన నిర్మాణాలు ఆగిపోయాయని, కార్మికులకు పనులు లేకుండా పోయినట్లు పలువురు నాయకులు ఈ సందర్భంగా వినతిపత్రాన్ని అందచేశారు. వారం రోజుల వ్యవధిలో ఇసుక సమస్య తీరుతుందని హామీ ఇచ్చారు. బి.కొత్తకోటలో మహిళల ఉపాధి కోసం గార్మెంట్ పరిశ్రమను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌రాజు, రాష్ట్ర పౌరసరఫరాల కార్పొరేషన్ సభ్యురాలు పర్వీన్‌తాజ్ మాట్లాడారు. నగర పంచాయతీ కమిషనరు పల్లవి, కూటమి పార్టీల నాయకులు కుడుం శ్రీనివాసులు, బంగారు వెంకట్రమణ, గంజి మోహన్, ఎండీ మస్తాన్, ఓబులేసు, రామచంద్ర, రియాజ్ అలీఖాన్, ఎల్.హుస్సేన్‌ఖాన్, చింతల కిరణ్‌కుమార్, కె.రవీంద్ర, నరసింహులుతో పాటు పలువురు అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కిసాన్ డ్రోన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా, వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు



బి.కొత్తకోట సభలో ప్రసంగిస్తున్న తంబళ్లపల్లె తెదేపా నేత జయచంద్రారెడ్డి, వేదికపై నాయకులు

ప్రభుత్వ వైద్య కళాశాలలపై రాజకీయాలొద్దు



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : మదనపల్లెలో నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాలలను అర్ధాంతరంగా ఆపేయడంతో కళాశాల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని దీనిపై కూటమి ప్రభుత్వం రాజకీయాలు మానుకోవాలని రాయలసీమ విద్యార్థి ఆర్గనైజేషన్ అధ్యక్షుడు జగన్ అన్నారు. గురువారం వికాస్ జూనియర్ కళాశాల ఆవరణలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. రాయలసీమలో మదనపల్లెకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. వైద్య కళాశాల పనులు అర్ధాంతరంగా ఆపేయడం వల్ల కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయన్నారు. రాయలసీమ ప్రాంతంలో కరవు కారణంగా ప్రజలు విదేశాలకు వెళ్లడం, వలసలు వెళ్లడం, ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. వైద్య విద్య కోసం కోట్లు ఖర్చుపెట్టుకుంటున్నారని ప్రభుత్వ వైద్య కళాశాలలను కొనసాగించకుండా తొలగించే ప్రయత్నం చేయడం విద్యార్థులను మోసం చేసినట్లేనని అన్నారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మాణం చేసిన వైద్య కళాశాలలను సత్వరం పూర్తి చేసి విద్యార్థులకు వైద్యవిద్యను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌వో నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన


రాజంపేటలో ఆందోళన చేస్తున్న ఏఐటీయూసీ, హమాలీల సంఘం నాయకులు

రాజంపేట, న్యూస్‌టుడే : పౌరసరఫరాల గోదాముల వద్ద పనిచేసే హమాలీలకు కొత్త కూలీ చట్టాన్ని అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఎస్.రాయుడు, పట్టణ కార్యదర్శి సికిందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రెండోరోజు గురువారం స్థానిక పౌరసరఫరాల గోదాము వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హమాలీలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హమాలీలకు అధికారుల నిర్లక్ష్యంతో ప్రతినెలా సకాలంలో వేతనాలు రావడంలేదన్నారు. కొత్త కూలీ చట్టాన్ని తెచ్చి 9 నెలలు కావస్తున్నా ఇంతవరకు అమలు చేయకపోవడం దారుణమన్నారు.

రాయచోటి
• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

బాలల హక్కులపై అవగాహన

వీరబల్లి, న్యూస్‌టుడే : బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతని బాలల హక్కుల జిల్లా సంరక్షణ అధికారి వినోద్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని ఎర్రంరాజుగారిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో బాలల హక్కులపై గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు, బాలల అక్రమ రవాణా, బాలకార్మిక నిర్మూలన వంటి అంశాలపై అవగాహన కల్పించి జాగ్రత్తలను తెలిపారు. హెచ్ఎం మనోహర్, ఎస్సై రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బాలల హక్కుల జిల్లా సంరక్షణ అధికారి వినోద్‌కుమార్

మేమున్నాం... మీకు తోడుగా... (10 AM to 1 PM)
రాజంపేట : 9441872651
రాయచోటి : 9703622242
రైల్వేకోడూరు : 7981695235

స్పందనకు వందనం

గాలివీడు బస్టాండు, ప్రధాన రహదారిలోని వీధి కుక్కలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇక్కడ కుక్కల సంచారంతో కలిగే ఇబ్బందులపై మేమున్నాం మీకుతోడుగాలో భాగంగా సమస్య ప్రచురితమైంది. స్పందించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్‌కుమార్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. - న్యూస్‌టుడే, గాలివీడు

? : సుండుపల్లి తహసీల్దారు కార్యాలయానికి వెళ్లే దారిలో వీధి దీపం గత కొన్ని రోజులుగా వెలగడం లేదు. దీంతో రాత్రి వేళల్లో అంధకారం నెలకొంది. వీధి దీపం వెలిగేలా చర్యలు తీసుకోవాలి. - స్థానికులు

✔ : వీధి దీపం మరమ్మతుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. - సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, సుండుపల్లి

పేదల సొంతింటి కల సాకారమయ్యేనా?

గత వైకాపా పాలనలో ముందుకు సాగని నిర్మాణాలు ● కూటమి ప్రభుత్వంపై లబ్ధిదారుల ఆశలు


రాజంపేట మండలం ఊటుకూరు వద్ద వివిధ దశల్లో గృహ నిర్మాణాలు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే : పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చామని గొప్పలు చెప్పిన గత వైకాపా పాలకుల మాటలు నీటి మీద రాతలుగా మారాయి. గతంలో రాజంపేట పట్టణానికి దూరంగా లబ్ధిదారులకు ఇంటి పట్టాలిచ్చారు. అక్కడ కనీస సౌకర్యాలేవీ కల్పించకపోవడంతో నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. కొందరు అప్పులు చేసి ఇంటి నిర్మాణాలను చేపట్టినా అక్కడ వసతుల్లేక నివాసం ఉండడం లేదు. ఈ సమస్యలను అధికారులు కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ఇంటి నిర్మాణాలు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అయితే పట్టాలు పొందిన వారు ఎక్కువ మంది అప్పటికే రూ.లక్షలకు వేరొకరికి విక్రయించారు. ● రాజంపేట పట్టణం పరిధిలో నాలుగు లేఅవుట్లు వేశారు. బ్రాహ్మణపల్లి, ఊటుకూరు, మిట్టమీదపల్లి, పోలి గ్రామ పంచాయతీల పరిధిలో దాదాపు 50 ఎకరాలు పరిధిలో 2666 పట్టాలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇందులో 487 మాత్రమే పూర్తయ్యాయి. పనులు ప్రారంభం కానివి 534, పునాది దశలో 148, పునాది పనులు పూర్తయినవి 1249, గోడల దశలో 11, గోడలు పూర్తయినవి 197, ఇంటి పైకప్పు పూర్తయినవి 51గా ఉన్నాయి.

నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు : ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఇప్పటికే కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పూర్తి స్థాయిలో సర్వే చేసి నివేదికలు పంపడం జరుగుతుంది. అదే విధంగా జిల్లా స్థాయి అధికారులు వచ్చి లేఅవుట్లను పరిశీలించి లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణాలు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. - మురళి, గృహనిర్మాణ శాఖ డీఈ, రాజంపేట

మినీ లారీ బోల్తా



నందలూరు, న్యూస్‌టుడే : నందలూరు ఆల్విన్ కర్మాగారం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చోదకుడికి స్వల్ప గాయాలయ్యాయి. కడప నుంచి రాజంపేటకు యూరియా లోడుతో వస్తున్న లారీ టైరు పేలి అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో చోదకుడు స్వల్ప గాయాలతో బయటపడ్డారు, సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రోడ్డుకు అడ్డంగా ఉన్న లారీని తొలగించారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

రాజంపేటగ్రామీణ, న్యూస్‌టుడే : రాజంపేట మండలం మండలం గుండ్లూరు వద్ద ఉన్న చెయ్యేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా రెండు ట్రాక్టర్లను మన్నూరు పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు మన్నూరు సీఐ రామాంజనేయులు తెలిపారు.

ఇరు వర్గాల ఘర్షణ

చిన్నమండెం : మల్లూరు పంచాయతీ బల్లెవాండ్లపల్లెలో దారి స్థల సమస్య విషయమై ఇరు వర్గాలు ఘర్షణ పడ్డారు. ఇరువురికి మాటా మాట పెరిగి దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు.

పోక్సో కేసు నమోదు

గాలివీడు : గాలివీడు మండలం పరిధిలో ఒకరిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్సై రామకృష్ణ పేర్కొన్నారు. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ధర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మోటార్ల తీగల చోరీ

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కాకుళవరం గ్రామ పంచాయతీలోని గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం అర్ధరాత్రి 10 వ్యవసాయ మోటార్ల వద్ద కాపరు వైరు చోరీ చేసినట్లు రైతులు రామాంజుల్‌రెడ్డి, రామయ్య, హారున్‌బాషా, వెంకట్రామిరెడ్డి, దాదాసాహెబ్, వీరనాగమ్మ వాపోయారు. పంట చేతికొచ్చే సమయానికి గుర్తు తెలియని వ్యక్తులు స్టాటర్, బోరులోపల ఉన్న కాపరు వైరు తీసుకెళ్లారని గురువారం లక్కిరెడ్డిపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పురపాలక కమిషనర్ బాధ్యతల స్వీకరణ


నాగేశ్వరరావు

రాజంపేట, న్యూస్‌టుడే : రాజంపేట పురపాలక కమిషనర్‌గా బి.నాగేశ్వరరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ రాంబాబు సెలవుపై వెళ్లడంతో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో సూపరింటెండెంటుగా పనిచేస్తున్న నాగేశ్వరరావును రాజంపేటకు బదిలీ చేశారు. అందరి సహకారంతో రాజంపేట పట్టణాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

అన్నక్యాంటీన్‌కు విరాళం


లక్ష్మీప్రసాద్‌రెడ్డికి చెక్కు అందజేస్తున్న శివశంకర్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే : అన్న క్యాంటీన్‌కు రూ.10 వేలు చెక్కును వితరణగా అందజేసినట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మండల పరిధిలోని అనంతపురం గ్రామం ఆడిగపల్లెలో తెదేపా నేత మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డికి తన వంతు సాయంగా అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నిత్యపూజయ్య, మణివిశ్వనాథ, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏఐఎస్ఎఫ్ జిల్లా రెండో మహాసభ

రాజంపేట : రాజంపేటలో ఈనెల 27 నుంచి మూడు రోజుల పాటు ఏఐఎస్ఎఫ్ జిల్లా రెండో మహాసభలను నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు మాధవ్ తెలిపారు. ఈమేరకు సంఘ నాయకులు గురువారం సమావేశమై వివరాలను వెల్లడించారు. ఈ మహాసభల్లో విద్యారంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చ ఉంటుందని తెలిపారు.

మండల కమిటీ ఎన్నిక : ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీ అధ్యక్షుడిగా పృథ్వి, కార్యదర్శిగా సాధిక్, ఉపాధ్యక్షులుగా గోపి, సతీష్, సహాయ కార్యదర్శులుగా దామోదర్, శివాజీ, తేజ, కోశాధికారిగా రెడ్డయ్య నియమితులయ్యారు.

వక్ఫ్‌బోర్డు పరిధిలోకి తీసుకురావాలని డిమాండు

రాజంపేట, న్యూస్‌టుడే : మసీదు ఆస్తులను వక్ఫ్‌బోర్డు పరిధిలోకి తేవాలని రాజంపేట పట్టణం ముకుందరగడ్డ, మంగళమిట్ట ప్రాంతానికి చెందిన కొందరు మైనార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక పాతబస్టాండు కూడలిలోని మసీదు వద్దకు చేరుకోగా మరో వర్గం అక్కడి వచ్చింది. దీంతో ఇరువర్గాల మధ్య వాదనలు చోటు చేసుకున్నాయి. అక్కడే ఉన్న పోలీసులు సర్దిజెప్పి ఇరువర్గాల ప్రజలను మసీదులోకి పంపించారు.

గృహనిర్మాణాలపై సమావేశం

సుండుపల్లి : మన ఇల్లు మన గౌరవం కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలని ఎంపీడీవో ఎన్.రామచంద్ర కోరారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈనెల 28న ప్రతిగ్రామ సచివాలయ సమావేశంలో గత ప్రభుత్వంలో గృహాలు మంజూరైన లబ్ధిదారులతో సమావేశం నిర్వహించాలన్నారు. ఈ ఏడాది చివరిలోగా ఇంటి పనులుపూర్తి చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్ విజయవంతానికి పిలుపు


రాజంపేటలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

రాజంపేట, న్యూస్‌టుడే : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 30న ఒప్పంద కార్మికులు, పొరుగుసేవల సిబ్బంది, దినసరి కూలీలు నిర్వహించే చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సి.రవికుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు రాజంపేటలో గురువారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తున్నా సమస్యలు తీరలేదని, కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరుబాట పట్టామని చెప్పారు.

స్థలం పరిరక్షణకు చర్యలు

రామాపురం : మండల కేంద్రంలోని పాతరామాపురంలో పోలీస్ క్వార్టర్స్‌కు కేటాయించిన సర్వే 593-1లో విస్తీర్ణం 0.67 సెంట్ల స్థలం ఆక్రమణకు గురికాకుండా గురువారం ఎస్సై వెంకటసుధాకర్‌రెడ్డి జేసీబీతో ముళ్లపొదలను తొలగించారు. త్వరలోనే పోలీసులకు కేటాయించిన స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేస్తామన్నారు.

రామాలయంలో విద్యార్థినికి గాయాలు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : ఒంటిమిట్ట కోదండ రామాలయం దర్శనానికి వచ్చిన జమ్మలమడుగుకు చెందిన ఓ విద్యార్థిని గాయపడ్డారు. పుల్లంపేటలో క్రీడాపోటీల్లో పాల్గొని గురువారం ఆలయానికి వచ్చారు. ఆలయంలో జీర్ణోద్ధరణ పనుల కారణంగా భక్తులు నడక సాగించడానికి చెక్కలు అమర్చారు. విద్యార్థులు చెక్కలపై వెళుతుండగా బరువు ఎక్కువ కావడంతో ఓ విద్యార్థి కాలుపై ర్యాంపు పడటంతో గాయపడ్డారు. విద్యార్థినిని స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, పక్కన నాయకులు, అధికారులు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే : గత వైకాపా పాలనతో విసిగిపోయిన ప్రజలు ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని, వారి ఆశీర్వాదంతో మంచి పనులు చేయడానికి ప్రోత్సాహం లభిస్తోందని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. పట్టణంలోని ఓ కల్యాణమండపంలో గురువారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశానికి తెదేపా నియోజకవర్గ బాధ్యుడు ముక్కా రూపానందరెడ్డి, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు, పింఛనుదారులకు నగదు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఇటీవల తలెత్తిన వరదల్లో సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ బాధితులతో బాధ్యతగా వ్యవహరించిన విధానం ప్రశంసలు కురిపించిందన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వెంకటేశ్వరరాజు, రమేష్, నీలకంఠయ్య, రామసుబ్బారెడ్డి, సుబ్బారావు, ఎంపీడీవో జాషువా, సర్పంచి బుడిగి శివయ్య, పంచాయతీ ఈవో ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

రూ. 1.40 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం : లక్కిరెడ్డిపల్లె : మండలంలో రూ. 1.40 కోట్లతో సిమెంటు రోడ్ల పనులకు శ్రీకారం చుట్టామని మంత్రి సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు మదనమోహన్ ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని అనంతపురం గ్రామం ఈడిగపల్లెలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు అనంతపురం గంగమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మండలంలో ఎక్కువగా తాగునీటి సమస్య ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదులందాయని వాటిని అధికారులకు తెలిపి పరిష్కారం చేస్తామని స్పష్టం చేశారు. డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, గృహ నిర్మాణశాఖ అధికారి సాంబశివరావు, వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొండయ్య, పశువైద్యశాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై, పంచాయతీ రాజ్ అధికారి దయాకర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు, వ్యవసాయ సహాయ సంచాలకులు జయరాణి, ఎంపీడీవో వెంకట్రామిరెడ్డి తహసీల్దారు లక్ష్మీప్రసన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వీరబల్లి : ప్రజాసంక్షేమమే చంద్రన్న ప్రభుత్వం ధ్యేయమని తెదేపా వీరబల్లి మండలశాఖ అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం మండలంలోని ఓదివీడు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వంలో వంద రోజులలో చేసిన అభివృద్ధిని వివరించారు. గురప్పగారిపల్లి పంచాయతీలోనూ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఓదివీడు మాజీ సర్పంచి సుబ్బరామరాజు, యూనిట్ ఇన్‌ఛార్జి రెడ్డెయ్యరాజు, గ్రామ కమిటీ అధ్యక్షులు వీరామృతనాయుడు, నాగప్పనాయుడు, చలపతి, సిద్ధిరాజు తదితరులు పాల్గొన్నారు.


వీరబల్లి: మహిళకు కరపత్రం అందజేస్తున్న తెదేపా మండల అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు, నాయకులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్క నాటుతున్న రోటరీ క్లబ్ సభ్యులు


నాగిరెడ్డిపల్లె జడ్పీ ఉన్నతపాఠశాలలో మొక్క నాటుతున్న భాజపా నాయకులు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని రోటరీ క్లబ్ సభ్యులు అన్నారు. ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాయచోటిలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మనోజ్ కుమార్, శశి శేఖర్, రాజు, సురేష్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందలూరు : స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని నాగిరెడ్డిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో సర్పంచి జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు నాయకులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ జీవితంలో తల్లి పేరుతో ఒక మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఛైర్మన్ తిరుపాలు, నాయకులు హిమగిరి, ఆదినారాయణ, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా


ట్రాక్టరులోకి మట్టిని నింపుతున్న యంత్రం

నందలూరు, న్యూస్‌టుడే : నందలూరు మండలంలోని కన్యకా చెరువు, ఎర్రచెరువు ప్రాంతాలు అక్రమ మట్టి రవాణాకు అడ్డాగా మారాయి. జేసీబీ యంత్రాలతో చెరువులోని మట్టిని పెద్దఎత్తున అక్రమార్కులు యథేచ్ఛగా ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని నందలూరు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వారం రోజులుగా మధ్యాహ్నం, రాత్రి వేళల్లో వందలాది ట్రాక్టర్ల మట్టిని తరలిస్తున్నారని, దీంతో రహదారులు అధ్వానంగా మారాయని చెబుతున్నారు. ఇదేమని ప్రజలు ప్రశ్నిస్తే సంబంధిత ట్రాక్టరు యజమానులు దాడులకు తెగబడుతున్న ఉదంతాలున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం : మట్టి రవాణా గురించి మాకు సమాచారం లేదు. యథేచ్ఛగా మట్టి తరలిస్తున్న అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటాం. - అమర్‌నాథ్, తహసీల్దార్, నందలూరు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన సుండుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులతో పీడీ రాధారాణి.. పుల్లంపేట: బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సుండుపల్లి, న్యూస్‌టుడే : ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి కడప జిల్లా బాలికల జట్టుకు సుండుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి అయిదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని పీడీ రాధారాణి తెలిపారు. గండి గురుకుల పాఠశాలలో గురువారం జరిగిన ఎంపికలో వాణి, గగన, నవ్య, అల్ఫీషా, హఫీఫాలు ఎంపికయ్యారని పేర్కొన్నారు.

పుల్లంపేట : క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికే రాష్ట్ర స్థాయి జట్టులో అవకాశాలు కల్పిస్తామని ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారద అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 బాల, బాలికలకు క్రికెట్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ క్రీడలను ఎంఈవో చక్రధర్‌రాజు, ఆదర్శపాఠశాల ప్రిన్సిపల్ లీలశ్రీహరి ప్రారంభించారు. ప్రతిభ చాటిన వారిని రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపిక చేశారు. అసోసియేషన్ కార్యదర్శి విజయ్‌ప్రసాద్‌రెడ్డి, పీడీలు చంద్రమోహన్‌రాజు, జిలానిబాషా, అరుణకుమారి, నీలకంఠేశ్వరరావు, కనకరుద్రమ్మ, సుబ్బరాజు పాల్గొన్నారు.

రాజంపేట : కడప మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో రాజంపేట మార్షల్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన అక్షయ అండర్-17 విభాగంలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపికైనట్లు మాస్టర్లు బాలాజీ, రెడ్డిప్రవీణ్ తెలిపారు.

జిల్లా స్థాయి పోటీలకు... : పుల్లంపేట : జిల్లా స్థాయి పోటీలకు 8 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కొత్తపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున, పీడీ బాలశేఖర్‌లు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. లోకేశ్, ఓంకార్ (వాలీబాల్), తులసి, జోత్స్న (షటిల్ బ్యాడ్మింటన్), అమీర్‌బాషా (చదరంగం), ప్రశాంత్‌నాయక్, గంగాచరణ్‌రెడ్డి, సాగర్, సందీప్ (యోగా)లో ఎంపికయ్యారని తెలిపారు.

పెనగలూరు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గ స్థాయిలో చక్రంపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ సాధించి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు లేబాక గోపాలకృష్ణ తెలిపారు. విద్యార్థులు సానియా, వేణుతేజ, తరణ్ రాజ్, సర్వజ్ఞ, కవితలను అభినందించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే : కొర్లకుంట రైల్వేవంతెన సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం గుర్తించారు. ఓబులవారిపల్లె ఎస్సై మహేష్ తెలిపిన వివరాల మేరకు.. రైల్వేవంతెన వద్ద దుర్వాసన రావడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని పరిశీలించగా.. మృతుడు వయసు 45 నుంచి 50 మధ్య ఉంటుందన్నారు. మృతుడు గోధుమ రంగు చొక్కా, బ్లూ రంగు ప్యాంట్ ధరించి, జంధ్యం వేసుకుని ఉన్నారని తెలిపారు. అతనిపై ఎటువంటి గాయాలు లేవని వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట బస్టాండు ప్రాంతాల్లోని దుకాణాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ కృష్ణంరాజు నాయక్ వ్యాపారులకు సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు గురువారం వ్యాపారులను పిలిపించి పలు సూచనలు చేశారు.

రోడ్డుపై మురుగు... వేసేదెలా అడుగు



పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండడంతో రోగాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వీరబల్లిలోని స్టేషన్ వీధిలో మురుగు కాలువ అసంపూర్తిగా ఉండడం, ఆక్రమణకు గురికావడంతో రోడ్డుపైనే మురుగు ప్రవహిస్తోంది. కాలువలో మురుగు సాగక బయటకు పొంగిపొర్లుతోంది. దీంతో వ్యాధులు వస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఇన్‌ఛార్జి ఎంపీడీవో రామచంద్రారెడ్డి మాట్లాడుతూ మురుగు కాలువ ఏర్పాటుకు చుట్టుపక్కల వారు సహకరించడం లేదని, భూ యజమానులతో ఒప్పించి కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, వీరబల్లి

న్యాయ కళాశాల ప్రకటనపై హర్షం

రాజంపేట, న్యూస్‌టుడే : వంద ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో న్యాయకళాశాలను నిర్మిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించడం చాలా సంతోషమని తెదేపా లీగల్‌సెల్ పార్లమెంటు అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ మేరకు పార్టీ లీగల్‌సెల్ కార్యాలయంలో గురువారం న్యాయవాదులు సమావేశమై ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. జూనియర్ న్యాయవాదులకు రూ. 10 వేలు ఇస్తామని చెప్పడం, హైకోర్టు బెంచ్‌ని కర్నూలులో ఏర్పాటు చేస్తామని ప్రకటించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు కృష్ణకుమార్, రమేష్‌నాయుడు, రామాంజనేయులు, నాగేంద్రబాబు, వెంకటసుబ్బయ్య, గిరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్యను సద్వినియోగం చేసుకోండి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు

చిన్నమండెం, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం మార్గదర్శకాలనుసరించి చదువు మధ్యలో ఆపేసిన వారు దూర విద్యా విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీనివాసరాజు కోరారు. చిన్నమండెం మండల విద్యా కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. దూరవిద్యా విధాన పోస్టర్లను స్థానిక ఎంఈవో శివానాయక్‌తో కలిసి ఆవిష్కరించారు. చదువు మధ్యలో ఆపేసిన వారు పదో తరగతి, ఇంటర్‌ను ఈ పద్ధతిలో పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ నెల 28లోగా ఫీజు కట్టి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వెంకట్రామరాజు, రామాంజులు, హనుమంతరావు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం 29న

సుండుపల్లి, న్యూస్‌టుడే: సుండుపల్లిలోని వశిష్ఠ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 29న ఉచిత న్యూరో వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో న్యూరాలజిస్టు డా.వినూత్న ఆధ్వర్యంలో కన్సల్టేషన్, మందులు ఉచితంగా అందజేస్తారన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.